# చైతన్యరథం

ముద్దాడ రవిచంద్ర నియామకం





## అతిరథ మహారథులు, అశేష జనం సాక్షిగా

# కొలువుదీరిన చంద్రబాబు ప్రభుత్వం



- ప్రమాణ స్వీకారం చేయించిన గవర్నర్ అబ్దుల్ నజీర్
- బాబును ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్న ప్రధాని
- తరలివచ్చిన పలువురు కేంద్ర మంత్రులు
- రాష్ట్ర పునర్నిర్మాణానికి కేంద్రం అండగా ఉంటుందనే సంకేతాలు

2

పవన్, లోకేష్, అచ్చెన్న సహా 24 మంది మంత్రుల ప్రమాణం





## నేడు చంద్రబాబు బాధ్యతల స్వీకారం

## ఉప్పొంగిన నవ్యాంధ్ర!



3

## లోకేష్‌కు మోదీ శుభాకాంక్షలు



5

## విడతలవారీగా శ్వేతపత్రాలు విడుదల చేద్దాం

## కువైట్‌లో భారీ అగ్నిప్రమాదం

## కిక్కిరిసిన కేసరపల్లి!

4

చైతన్యరథం

## అతిరథ మహారథులు, అశేష జనం సాక్షిగా

# కొలువుదీరిన చంద్రబాబు ప్రభుత్వం

- ప్రమాణ స్వీకారం చేయించిన గవర్నర్ అబ్దుల్ నజీర్
- బాబును ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్న ప్రధాని
- తరలివచ్చిన పలువురు కేంద్ర మంత్రులు
- రాష్ట్ర పునర్నిర్మాణానికి కేంద్రం అండగా ఉంటుందనే సంకేతాలు



గన్నవరం: అతిరథ మహారథులు, అశేష జనం సాక్షిగా టీడీపీ అధినేత చంద్రబాబు ఏపీ ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణస్వీకారం చేశారు. ఎన్నికల ప్రచారంలో అలుపే తెలియని రీతిలో అహోరాత్రులు చంద్రబాబు పడిన కష్టానికి ఫలితం దొరికింది. ప్రధాని నరేంద్రమోదీ సహా పలువరు దిగ్గజ నాయకుల సమక్షంలో మహోన్నత ఘట్టం ఆవిష్కృతమయ్యింది. గన్నవరం సమీపంలోని కేసరపల్లి ఐటీ పార్క్‌లో బుధవారం ఉదయం ప్రధాని మోదీ ముఖ్యఅతిథిగా హాజరై, అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో చంద్రబాబు చేత రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ప్రమాణ స్వీకారం చేయించారు.

నారా చంద్రబాబు నాయుడు అనే నేను.. అని చంద్రబాబు అనగానే సభా ప్రాంగణమంతా కేకలు, చప్పట్లు, కేరింతలు, ఈలలతో మార్మోగిపోయింది. శాసనం ద్వారా నిర్మితమైన భారత రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసం, విధేయత చూపుతానని, భారతదేశ సార్వభౌమాధికారాన్ని, సమగ్రతను కాపాడతానని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నా కర్తవ్యాలను శ్రద్ధతో, అంతఃకరణ శుద్ధితో నిర్వహిస్తానని, భయం కానీ, పక్షపాతం కానీ, రాగద్వేషాలు కానీ లేకుండా... రాజ్యాంగాన్ని, శాసనాలను అనుసరించి ప్రజలందరికి న్యాయం చేకూర్చుతానని దైవసాక్షిగా ప్రమాణం చేస్తున్నాను అంటూ చంద్రబాబు ప్రమాణం ఆచరించారు.

ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం చంద్రబాబును ప్రధాని మోదీ ఆప్యాయంగా ఆలింగనం చేసుకొని మీ వెనుక నేనున్నానంటూ వెన్ను తట్టారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ తదితరులు చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ తనయుడు రామకృష్ణ, ఇతర కుటుంబ సభ్యులు భావోద్వేగానికి గురయ్యారు. ప్రధానితో పాటు బీజేపీ అగ్రనేతలైన కేంద్ర మంత్రులు అమిత్ షా, జేపీ నడ్డా, నితిన్ గడ్కరీ ఈ ప్రమాణ స్వీకారానికి హాజరై దెబ్బతిన్న రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం అన్ని విధాలా అండగా ఉంటుందనే సంకేతాన్ని ఇచ్చారు. వీరే కాకుండా కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, చిరాగ్ పాశ్వాన్, రాందాస్ అథవాలే, అనుప్రియా పాటిల్ కూడా హాజరయ్యారు.

ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మాజీ సీజేఐ ఎన్వీ రమణ, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, బీజేపీ ఏపీ అధ్యక్షురాలు పురందేశ్వరి, తెలంగాణ బీజేపీ నేత ఈటల రాజేందర్, ఇక మెగాస్టార్ చిరంజీవి సహా ఆయన కుటుంబం, తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్, ఆయన సతీమణి, పలువురు సినీ నటులు, పలు పార్టీలకు చెందిన నేతలు హాజరయ్యారు.

కార్యక్రమంలో మంత్రులుగా మరో ఇరవై నాలుగు మంది ప్రమాణం చేశారు. వీరిలో జనసేన తరపున ముగ్గురు, బీజేపీ తరపున ఒక్కరు ఉన్నారు. చంద్రబాబు మంత్రివర్గంలో యువత ఎక్కువగా ఉన్నారు. మొదట చంద్రబాబు, తర్వాత పవన్ కల్యాణ్.. ఆ తర్వాత లోకేష్ అలా ప్రమాణ వరుస సాగిపోయింది. చంద్రబాబు, పవన్, లోకేష్, అచ్చెన్నాయుడు ప్రమాణం చేస్తున్నప్పుడు సభా వేదిక దద్దరిల్లిపోయింది. మంత్రివర్గంలో యువతకు, బీసీలకు ప్రాధాన్యత ఇచ్చారు. మొత్తం 24 మందిలో 9 మంది బీసీలకు అవకాశం కల్పించారు.

కార్యక్రమానికి ఊహించిన దాని కంటే పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చారు. పార్టీల ముఖ్య నేతలు.. ఇతరులతో గ్యాలరీలన్నీ ప్రముఖులతో నిండిపోయాయి. చంద్రబాబు ప్రమాణానికి ఢిల్లీ నుంచి పలువురు ప్రముఖులు తరలి వచ్చారు. ప్రమాణానికి ముందు వీరంతా.. అక్కడి సభా ఏర్పాట్లను.. జనాలను చూసి ఆశ్చర్యపోయారు. మొత్తంగా చంద్రబాబు 4.0 ప్రభుత్వం ఓ పండగలా కొలువుదీరింది. ఉదయం 11:27 గంటలకు ప్రమాణస్వీకార ముహూర్తం కాగా.. ఉదయం 8 గంటల నుంచే జనం వచ్చారు. ఉదయం 9 గంటలకే సభావేదిక కిక్కిరిసిపోయింది. వీఐపీ పాసులున్నప్పటికీ చాలామంది సీట్లు లేక నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. వేదిక అయిన గన్నవరం మొత్తం



పసుపుమయం అయింది. అన్ని ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున జనం తరలి వచ్చారు. పాసులే పాతికే వేల వరకూ పంపిణీ చేసినట్లుగా తెలుస్తోంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహా పలువురు కీలక నేతలు వస్తూండటంతో పటిష్టమైన ఏర్పాట్లు చేశారు. విశాలమైన స్థలంలో సభా ప్రాంగణం ఏర్పాటు చేశారు. వాహనాలన్నీ పదికిలోమీటర్ల వరకూ ఎక్కడివక్కడ ఆగిపోయాయి.

రాష్ట్రంలో జగన్‌రెడ్డి ప్రభుత్వం మారాలని, చంద్రబాబు సీఎం కావాలని ప్రజలు ఎంతగా ఎదురు చూశారో ప్రమాణ స్వీకారం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న సందడే తెలియజేసింది. వివిధ నియోజకవర్గాల నాయకులు, ముఖ్య కార్యకర్తలు ప్రమాణస్వీకారానికి తరలివచ్చినా, అన్ని నియోజకవర్గాల్లో సందడి వాతావరణం నెలకొంది. ఎక్కడికక్కడ భారీ ఎల్ఈడీ తెరలు ఏర్పాటు చేసుకుని ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని లక్షలాది జనం వీక్షించారు.

చంద్రబాబు నాయుడు 4వసారి ముఖ్యమంత్రి పదవి చేపట్టి సరికొత్త రికార్డు నెలకొల్పారు. సమైక్య రాష్ట్రంలో రెండుసార్లు, విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రెండుసార్లు ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు నాయుడుకి ఇంతకు ముందు ముఖ్యమంత్రిగా 14 ఏళ్ల అనుభవం ఉంది. ఇప్పటి వరకు 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా కొనసాగిన ఏకైక తెలుగు నాయకుడిగా చరిత్ర ఉన్న నేపథ్యంలో మరోసారి సీఎం పదవిని చేపట్టి తన రికార్డును తానే తిరగరాసుకున్నారు. ఇప్పుడు 4వ సారి మరో 5 ఏళ్ళు కూడా కలుపుకుంటే దాదాపు రెండు దశాబ్దాలు ముఖ్యమంత్రిగా చేసిన నాయకుడిగా రాష్ట్ర చరిత్రలో నిలుస్తారు.

అయితే చంద్రబాబు గతంలో మూడుసార్లు సమర్థ పాలన అందించినప్పటికీ ఎప్పుడూ లేనంత చిక్కుల వలయం ఈసారి రాష్ట్రాన్ని కమ్ముకుని ఉంది. జగన్‌రెడ్డి విధ్వంస రాజకీయాల కారణంగా ఐదేళ్లుగా సర్వనాశనమైన రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి బాట పట్టించటం, పరిశ్రమలు, ఐటీ కంపెనీలను రప్పించి ఉద్యోగాలు కల్పించడం, అమరావతి, పోలవరం నిర్మాణ పనులను పూర్తిచేయడం వంటి చాలా బాధ్యతలు ఆయన భుజాలపై ఉన్నాయి. ఇవన్నీ సరిచేస్తూనే ఇచ్చిన హామీలు నెరవేర్చడంతో పాటు నిజమైన అభివృద్ధి అంటే ఏంటో నిరూపించాల్సిన గురుతర బాధ్యత టీడీపీ కూటమి మీద ఉంది. 4వసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు నాయుడుకి మరోసారి తన సమర్థతని నిరూపించుకునే అవకాశం లభించిందని భావించవచ్చు.

### ఎయిర్ పోర్టు నుంచి ఒకే వాహనంలో మోదీ, చంద్రబాబు



టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్ కల్యాణ్ గన్నవరం విమానాశ్రయంలో ప్రధాని నరేంద్ర మోదీకి స్వయంగా స్వాగతం పలికారు. అనంతరం, ప్రధాని మోదీ, చంద్రబాబు ఒకే వాహనంలో కేసరపల్లి ఐటీ పార్కు వద్దకు బయల్దేరారు. ఈ ఉదయం 11.27 గంటలకు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు.

# శాఖలవారీగా శ్వేతపత్రాలు విడుదల చేద్దాం

- వైసీపీ మంత్రుల పేషీల్లో సిబ్బందిని దరి చేరనీయొద్దు
- కొత్త మంత్రులకు చంద్రబాబు దిశా నిర్దేశం
- నేటిలోగా శాఖలు కేటాయిస్తానని స్పష్టీకరణ

అమరావతి: జగన్ నాశనం చేసిన వ్యవస్థలను బాగు చేయాలని, రాష్ట్ర పునర్నిర్మాణంలో మంత్రులదే కీలక బాధ్యత అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రమాణ స్వీకారం అనంతరం బుధవారం ఉండవల్లిలోని తన నివాసంలో మంత్రులతో చంద్రబాబు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కొత్త మంత్రులకు చంద్రబాబు పలు సూచనలు చేశారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ వద్ద, ఆయన మంత్రుల వద్ద పని చేసిన ఏ స్థాయి సిబ్బందినీ పనికి పెట్టుకోవద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులకు సూచించారు. గత వైసీపీ మంత్రుల వద్ద ఉన్న ఓఎస్డీలు, పీఏలు, పీఎస్‌ల విషయంలో పూర్తి అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. వారిప్పుడు మీ వద్దకు వచ్చే ప్రయత్నం చేస్తారని, దరి చేరనీయొద్దని ఆదేశించారు. శాఖలవారీగా వాస్తవ పరిస్థితులతో శ్వేతపత్రాలు సిద్ధం చేసి ప్రజలముందు ఉంచుదామని చెబుతూ పరిపాలనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. తాను సీఎంగా ఉన్నప్పటి పరిస్థితి, ఇప్పటి పరిస్థితిపై విశ్లేషించారు. మంత్రుల అభీష్టాలు, వారి సమర్థత మేరకు గురువారంలోగా శాఖలు కేటాయిస్తానని స్పష్టం చేశారు. ఇచ్చిన శాఖకు పూర్తి స్థాయి న్యాయం చేయాల్సిన బాధ్యత మంత్రులదేనన్నారు. అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మేలు చేయాలని సూచించారు.





# ఉప్పొంగిన నవ్యాంధ్ర!



అన్నట్టుగానే చంద్రబాబు గెలిచారు. రాష్ట్ర ప్రజలను గెలిపించారు. సంకల్పబలంతో పడిలేచిన కెరటమై -పీఠాన్నధిష్టించారు. ఇప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు. ఈమాటే నవ్యాంధ్రను ఉబ్బితబ్బిబ్బు చేస్తోంది. ఐదేళ్ల క్రితం చిన్న తప్పుచేసి రాక్షస పాలనకు తావిచ్చిన నవ్యాంధ్ర -ఐదేళ్లుగా ఈ ఘడియల కోసమే నిరీక్షించింది. ఈ క్షణాల కోసమే పరితపించింది. అందుకు -వైసీపీపై పగబట్టి ఓటుతో దండెత్తింది. ప్రగతి పథాన నడిపించే నాయకుడిని కోరుకుంటూ - కూటమికి అప్రతిహత విజయాన్ని అపాదించింది. దార్శనికుడు, అభివృద్ధికాముకుడు చంద్రబాబును ముఖ్యమంత్రినీ చేసుకుంది. ఒక అద్భుత విజయం కలిగినపుడు పొందే అనందంలో నవ్యాంధ్ర ఓలలాడుతోంది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చూసి ఉప్పొంగిపోయింది. విధ్వంసానికి గురైన రాష్ట్రం వికాసంవైపు పరుగులు తీయడం ఖాయమంటూ -గుండెలపై చేయి వేసుకుంది. 'వికసితాంధ్ర' ఆవిష్కరణకు -చంద్రబాబు ప్రమాణ స్వీకార క్షణాలే పునాధి రాళ్లు. జయహో చంద్రన్న! జయహో!!

అమరావతి (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్ కొత్త ముఖ్యమంత్రిగా తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు పదవీ బాధ్యతల స్వీకార ఘట్టంతో నవ్యాంధ్ర ఉప్పొంగిపోయింది. ఉద్వేగాలు, ఉద్విగ్నతల మధ్య గంభీరంగా సాగిన చంద్రబాబు పట్టాభిషేకాన్ని తిలకించిన నవ్యాంధ్రులు అనిర్వచనీయ ఆనందానుభూతి పొందారు. కృష్ణా జిల్లా గన్నవరానికి సమీపం కేసరపల్లిలో 11.18 ఎకరాల విస్తీర్ణ ప్రాంగణంలో సర్వాంగ సుందరమైన సంప్రదాయ వేదికమీద -బుధవారం ఉదయం నిర్ణీత ముహూర్తానికి చంద్రబాబును ముఖ్యమంత్రిగా రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ప్రమాణం చేయించారు. ఉమ్మడి రాష్ట్రానికి రెండుదఫాలు ముఖ్యమంత్రి బాధ్యతలు నిర్వర్తించిన అనుభవజ్ఞుడు, విభజితాంధ్రకు రెండోసారి ముఖ్యమంత్రైన ఘట్టం అపురూపం, ఆచంద్రతారార్కం కూడా. 'ఒక్క ఛాన్స్'తో చేసిన తప్పుకు ఐదేళ్ల రాక్షస పాలన శిక్ష అనుభవించిన ఆంధ్రావని.. సార్వత్రిక ఎన్నికల్లో కూటమికి పట్టంగట్టి పాప ప్రక్షాళన చేసుకుంది. రాక్షస మూకలపై పగతో ఓటెత్తి.. కూటమిని కసిగా గెలిపించి.. ఏ మార్గనిర్దేశకుడిని నాయకుడిగా ఎన్నుకుందో.. ఆ నాయకుడే.. ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరిస్తుంటే.. 'జయహో' అంటూ ఓటేసిన ప్రతి ఒక్కరూ ఉప్పొంగిపోయారు. ఆర్ద్రత నిండిన గుండెలతో తమకు తామే భుజాలు చరుచుకున్నారు. వేడుకను చూడ్డానికి గుంపులు కట్టినవాళ్లంతా 'హై'లిచ్చుకున్నారు. పార్టీ శ్రేణులైతే పసుపు కండువాలను గాల్లో తిప్పుతూ.. తెదేపా జెండా పొగరు చూపించారు. నాల్గవసారి ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరిస్తున్న చంద్రబాబును చూసుకుంటూ.. అప్రయత్నంగా 'జై చంద్రన్న' నినాదాలతో నవ్యాంధ్రను మార్మోగించారు. ఇక సభా ప్రాంగణమున్న కేసరపల్లి పరిసరాలు జై తెలుగుదేశం, జై చంద్రన్న నినాదాలతో ప్రతిధ్వనించింది. ప్రమాణ స్వీకారానికి హాజరైన అతిరథ మహారథులు, ప్రత్యేక ఆహ్వానితులు, దేశ విదేశీ ప్రముఖులు, రాజకీయ దురంధరులు, వ్యాపార దిగ్గజాలు, న్యాయశాస్త్ర కోవిదులు.. తెదేపా కుటుంబ పరివారాలు, అభిమానులు.. తమ స్థానాల్లోనే నిలుచుని చప్పట్లతో చంద్రబాబుకు అభినందనలు తెలిపిన ఘట్టం చరిత్రలో చిరస్థాయిగా నిలిచేదే. ఇంతకుముందు మూడుసార్లు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసినప్పటికీ.. ప్రస్తుత ప్రమాణ స్వీకారంలో చంద్రబాబు సైతం మరింత అణకువగా కనిపించడంతో.. అభిమానగణమంతా బాబు మేనియాలో మునిగిపోయారు. చంద్రబాబు ప్రమాణ పత్రాన్ని చదువుతున్నపుడు -అంతర్లీనంగా రాష్ట్ర విధ్వంసం.. ప్రజల ఈతిబాధలు.. ఆయన ఎదుర్కొన్న సవాళ్లు.. పాతికేళ్ల వెనక్కెళ్లిన ప్రగతి చిత్రం.. ఇలా రాష్ట్ర దుస్థితి తెరలుతెరలుగా మనోఫలకంపై ప్రత్యక్షమైన భావనకు గురయ్యారు. ఒక దార్శనికుడి విలువ గ్రహించకుండా పాలకమూకలు పగతో ఆయనను ఎంతగా నలిపేశారో గుర్తు తెచ్చుకున్నారు. ఆటుపోట్లపై పోరాటం చేసి.. దుష్ట సంకెలను తెంచి స్వేచ్ఛ సాధించిన చంద్రన్న -నిలువెత్తు ధైర్యం ముఖ్యమంత్రిగా ప్రమాణం చేస్తున్నట్టే భావించారు. ఇక దుష్టపాలన పీడ విరగడైందన్న వెర్రి ఆనందంలో -చెమర్చిన కళ్లతో ఉద్విగ్న క్షణాలను ఆస్వాదిస్తూ అలౌకిక అనందం పొందడం కనిపించింది. చంద్రబాబు ప్రమాణ స్వీకార అద్భుత ఘట్టాన్ని తిలకించేందుకు గంటపాటు టీవీలకు అతుక్కుపోయిన ఆంధ్రావని, 'నారా చంద్రబాబు నాయుడు అను నేను..' అన్న గొంతు వినడంతో వెర్రిగా కేరింతలు కొట్టింది. తమ కుటుంబంలోని పెద్దన్నే రాష్ట్ర పాలకుడైనంతగా మురిసిపోయింది. భరోసానిచ్చే నాయకుడు గద్దె నెక్కడంతో, భవిష్యత్‌కు భయం లేదన్న ధీమా ఐదుకోట్ల ఆంధ్రుల ముఖాల్లో ప్రతిబింబించింది. సరిగ్గా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన ముహూర్త సమయంలోనే -రాష్ట్రవ్యాప్తంగా కూటమి శ్రేణులు సంబరాలు జరిపాయి. పెద్దఎత్తున బాణాసంచా పేల్చి కొత్త ముఖ్యమంత్రి, కొత్త కేబినెట్‌పట్ల అభిమానాన్ని చాటుకున్నాయి. రాష్ట్రంలో అనేకచోట్ల ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకాలు జరిపారు. ప్రత్యక్షంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చూడలేకపోతున్నామన్న బాధకు తావివ్వకుండా.. రాష్ట్రంలో ఎక్కడికక్కడ పెద్దపెద్ద ఎల్ఇడి స్క్రీన్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పల్లెలకు పల్లెలు టీవీ స్క్రీన్ల వద్దకు చేరి.. పెద్దఎత్తున కేక్‌లు కట్ చేసి వేడుక జరుపుకున్నారు. చంద్రబాబు పేరిట ప్రతిష్ఠాత్మక దేవాలయాలు, గ్రామ దేవతల ఆలయాల్లో మహిళలు, పార్టీ శ్రేణులు ప్రత్యేక పూజలు నిర్వహించి అభిమానాన్ని చాటుకున్నారు. ముహూర్త సమయానికే -రాష్ట్రంలోని అనేక జిల్లాకేంద్రాలు, నగరాలు, ముఖ్యప్రాంతాల్లో భారీ ర్యాలీలు నిర్వహించడం కనిపించింది. కృష్ణా, గోదావరి నదుల్లో పడవల ర్యాలీలు, సుదూర ప్రాంతాలనుంచి సైకిల్ యాత్రలు.. ఎక్కడికక్కడ పేదలకు అన్నదానాలు.. ఇలా చంద్రబాబు ముఖ్యమంత్రైన ఆనందాన్ని ఎవరికి తోచినట్టు వారు మనసారా ప్రదర్శించారు. మొత్తంగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన ఉద్విగ్న క్షణాల్లో -ఆంధ్రావని ఉప్పొంగిపోయింది. ఉబ్బితబ్బిబ్బయ్యింది!

'నారా చంద్రబాబు నాయుడు అనే నేను...' అన్న పదాలను చంద్రబాబు కంఠంలో వినేందుకే -మే 13న ఓటేసిన క్షణాల నుంచీ ఆంధ్ర ప్రజలు ఎదురు చూస్తున్నారు. రాష్ట్ర ప్రజలు ఏ సంకల్పంతో ఓటేశారో.. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన ఘట్టంతో అది ముగిసింది. ఇక -చంద్రబాబు నుంచి రాష్ట్ర ప్రజలు ఏం ఆశించారో.. ఆ ఆశలు నెరవేర్చే ఘట్టం మొదలవ్వబోతోంది. విధ్వంస రాష్ట్రం వికాసం దిశగా అడుగులేయడం ఖాయమన్న నమ్మకమే -బాబు ప్రమాణ స్వీకార ఘట్టంలో ఆనందానుభూతులకు ప్రతీక. సీబీఎన్ పాలనపై జనం చూపిస్తోన్న అచంచల విశ్వాసానికి నిలువెత్తు నిదర్శనం.

- నారా చంద్రబాబు నాయుడు అను నేను..
- బాబు గొంతు వినగానే జనం కేరింతలు..
- కంటికింపుగా చంద్రబాబు పట్టాభిషేకం
- చెమర్చిన కళ్లతో తిలకించిన కేసరపల్లి
- ఉద్విగ్న క్షణాలను ఆస్వాదించిన ఆహూతులు
- ముహూర్త సమయానికి రాష్ట్రంలోనూ సంబరాలు
- దేవాలయాల్లో బాబు పేరిట ప్రత్యేక పూజలు
- అన్నదానాలతో అభిమానం చాటుకున్న శ్రేణులు
- గంటపాటు టీవీలకు అతుక్కుపోయిన నవ్యాంధ్రులు
- రాష్ట్రవ్యాప్తంగా భారీ స్క్రీన్లపై ప్రోగ్రాం టెలికాస్ట్
- వికాసం దిశగా విధ్వంస రాష్ట్రమంటూ ప్రజల్లో చర్చ
- సీబీఎన్ పాలనపై జనంలో అచంచల విశ్వాసం



# కిక్కిరిసిన కేసరపల్లి!







- ముఖ్యమంత్రి చంద్రన్న కోసం పోటెత్తిన జనం
- ప్రమాణ స్వీకార ప్రాంగణాన్ని కమ్మేసిన అభిమానం
- జన ప్రవాహాలైన జాతీయ రహదారులు
- కొన్ని గంటలపాటు విజయవాడ అష్టదిగ్బంధనం
- పార్టీ శ్రేణుల ఉత్సాహాన్ని ఆపలేకపోయిన పోలీసులు
- పలు ఆంక్షలతో ఎక్కడికక్కడ స్థంభించిన ట్రాఫిక్
- 'జై చంద్రన్న' నినాదాలతో ప్రతిధ్వనించిన పరిసరాలు

అమరావతి (చైతన్య రథం): విభజిత రాష్ట్రాన్ని వికాసంవైపు నడిపించే దార్శనికుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న అద్భుత ఘట్టాన్ని తిలకించేందుకు నలుదిక్కులూ కేసరపల్లిపై దండెత్తాయి. సార్వత్రిక ఎన్నికలలో అఖండ విజయం సాధించిన కూటమిని నడిపించే నాయకుడిగా ఎన్నికైన చంద్రబాబు -బుధవారం ఉదయం ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. కృష్ణా జిల్లా గన్నవరానికి సమీపంలోని కేసరపల్లిలో సాగే అద్భుత ఘట్టాన్ని కళ్లారా తిలకించేందుకు బుధవారం వేకువనుంచే నలుదిక్కుల ప్రజలు కేసరపల్లికి దారులుతీశారు. రాష్ట్రంలోని సుదూర జిల్లాల నుంచీ, వివిధ ప్రాంతాల నుంచీ బయలుదేరిన పార్టీ శ్రేణులు, అభిమానులు, సానుభూతిపరులు ఒక్కసారిగా కేసరపల్లికి అటూ ఇటూ చేరుకోవడంతో - ప్రధాన రహదారులు జనమయమయ్యాయి. అదే సమయంలో -చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవానికి అహ్వానితులుగా ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, నడ్డా, గడ్కరీ, వివిధ రాష్ట్రాల రాజకీయ నాయకులు, దేశ విదేశాల వ్యాపార దిగ్గజాలు, వివిధ రంగాల ప్రముఖులు హాజరవ్వడంతో.. వారి భద్రత దృష్ట్యా పోలీసులు బందోబస్తును పటిష్టం చేశారు. అనూహ్యంగా కేసరపల్లికి పోటెత్తిన అభిమాన జనాన్ని.. ప్రమాణ స్వీకార ప్రాంగణానికి దూరంలోనే ఆపడానికి ఆంక్షలు విధించారు. దాంతో బెజవాడ లోపలికి ప్రవేశించడానికి అవకాశం లేకపోవడంతో జన ప్రవాహం నిలిచిపోయి రోడ్లు స్థంభించాయి. కేసరపల్లికి చేరుకునే అంతర్గత రోడ్లు అభిమానుల వాహనాలతో కిక్కిరిసిపోవడంతో.. దాని ప్రభావం కేసరపల్లి నలుదిక్కులపైపడి ప్రధాన రహదారులపై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు ఆంక్షలతో విజయవాడలోకి వాహనాలు రాకుండా కనకదుర్గ వారధిపై బారికేడ్లు అడ్డుపెట్టడంతో ట్రాఫిక్ జామైంది. విజయవాడ-గన్నవరం మార్గంలో అడుగడుగునా పోలీసుల ఆంక్షలతో కార్యకర్తలు, అభిమానులు ఒకింత ఇబ్బందులకు గురయ్యారు. మరోవైపు గుంటూరు జిల్లా కాజా టోల్‌ప్లాజా వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. టోల్ రుసుం కోసం వాహనాలను సిబ్బంది నిలిపివేశారు. దీంతో సుమారు కిలోమీటర్లమేర వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ జామ్‌లో పమాణ స్వీకారానికి వెళ్లేందుకు కార్యకర్తలు, నేతలు ఇబ్బందులు పడ్డారు. వారధిపై చిత్తూరు, నెల్లూరు, ఒంగోలు వైపునుంచి వచ్చిన వాహనాలు భారీగా నిలిచిపోయాయి. విజయవాడలోని రామవరప్పాడు రింగ్‌పై, పొట్టిపాడు టోల్ ప్లాజా వద్ద భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఎక్కడ చూసినా ట్రాఫిక్ జామ్‌లే చోటు చేసుకోవడంతో.. చంద్రబాబు ప్రమాణ స్వీకారాన్ని చూడ్డానికి వచ్చిన వేలాది అభిమానులు కేసరపల్లికి చేరుకోలేకపోయారు.

## ప్రాంగణం వద్ద..

చంద్రబాబు ప్రమాణ స్వీకార ప్రాంగణం వద్దా పోలీసులు పెద్దఎత్తున ఆంక్షలు విధించడంతో.. వీవీఐపీలు సైతం లోపలికి చేరుకోవడానికి ఇబ్బందిపడాల్సి వచ్చింది. అంతర్గత రహదారుల నుంచి ప్రధాన రహదారికివచ్చే దారులన్నీ పోలీసులు నిర్బంధించారు. ఎక్కడికక్కడ బారికేడ్లు పెట్టడంతో.. సభా ప్రాంగణం వద్దకు ఉదయాన్నే వేలాదిగా పోటెత్తిన తెలుగుదేశం శ్రేణులు ఇబ్బందులు పడ్డారు. పాస్‌లు లేనివాళ్లను పోలీసులు వెనక్కి పంపిస్తే.. పాసులు చూపించిన వారినుంచి వాటిని తీసుకుని చించేసి లోపలికి పంపారు. దీంతో, ప్రాంగణంలోకి ప్రవేశించిన వారు లోపల ఎక్కడ కూర్చోవాలో అర్థంకాని పరిస్థితులు ఎదురయ్యాయి.



## భారీ భద్రతా చర్యలు

ప్రమాణ స్వీకార కార్యక్రమానికి అత్యంత ప్రముఖులు తరలి రావడంతో పోలీసులు గట్టి భద్రతా చర్యలు తీసుకున్నారు. దాదాపు పదివేలమంది భద్రతా సిబ్బంది విధులు నిర్వర్తించారు. ఒక్క విజయవాడలోనే 3 వేల మంది పోలీసులు భద్రతా చర్యల్లో నిమగ్నమయ్యారు. ఇక గన్నవరం విమానాశ్రయం, పరిసర ప్రాంతాలు, కేసరపల్లి సభా ప్రాంగణం లోపల, వెలుపల 7వేల మందికి రక్షణ విధులు అప్పగించారు. డీజీ హోదా మొదలు ఎస్పీ ర్యాంకు వరకూ మొత్తంగా 60మంది ఐపీఎస్‌లు భద్రతా పర్యవేక్షణ బాధ్యతలు నిర్వర్తించారు. వీవీఐపీల వాహనశ్రేణి నేరుగా వేదికకు వచ్చేందుకు వీలుగా ప్రత్యేక బీటీ రోడ్లు నిర్మించారు.

## ఎక్కడికక్కడ భారీ స్క్రీన్లు..

ప్రమాణ స్వీకార ప్రాంగణంలో 36 గ్యాలరీల్లో భారీ స్క్రీన్స్‌పై ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని అహూతులు తిలకించారు. కార్యక్రమం అందరికీ కనిపించేలా 36 గ్యాలరీల్లోనూ ఎస్ఈడీ స్క్రీన్స్ ఏర్పాటు చేశారు. వీవీఐపీల కోసం ప్రత్యేకంగా మూడు గ్యాలరీలు ఏర్పాటు చేశారు. అలాగే, విజయవాడ పరిధిలో ఆనం కళాకేంద్రం, సుబ్రహ్మణ్య మైదానం, రామాలయం సెంటర్, పుష్కరఘాట్, హైటెక్ బస్టాండ్ తదితరచోట్ల భారీ స్క్రీన్లు ఏర్పాటు చేసి చంద్రబాబు ప్రమాణ స్వీకారం తిలకించేందుకు ప్రజలకు అవకాశం కల్పించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఏడు నియోజకవర్గాల పరిధిలో 29 స్క్రీన్లు, రాజమహేంద్రవరంలో తొమ్మిదిచోట్ల అధికారులు స్క్రీన్లు ఏర్పాటు చేశారు. అదేమాదిరి రాష్ట్రంలోని మరికొన్ని జిల్లాల్లోని బహిరంగ ప్రదేశాల్లో ఎస్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయడం గమనార్హం. గుంటూరు జిల్లా తుళ్లూరులో రాజధాని ప్రాంత రైతులు, మహిళలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తెరపై అమరావతి రూపకర్త చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవాన్ని వీక్షించారు. అమరావతి పరిరక్షణ సమితి అధ్వర్యంలో దీన్ని ఏర్పాటు చేశారు. నంద్యాల జిల్లా గడివేములలో, తిరుపతి పట్టణంలో చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని మహిళలు ఎల్ఈ స్క్రీన్లలో తిలకించారు.





# చంద్రబాబు ప్రమాణస్వీకారానికి దేశ, విదేశీ ప్రముఖులు





అమరావతి, చైతన్యరథం: నాలుగవసారి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారానికి దేశ నలుమూలల నుండి తోపాటు విదేశీ(ప్రముఖులు కూడా హాజరయ్యారు. అంగరంగ వైభవంగా సాగిన ఈ మహెూత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కేంద్ర హెూంశాఖా మంత్రి అమిత్‌షాతోపాటు కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, నితిన్ గడ్కరీ, జి.కిషన్‌రెడ్డి, కె.రామ్మోహన్ నాయుడు, బండి సంజయ్‌కుమర్, సుప్రియా పాటిల్, చిరాగ్ పాశ్వాన్, రాందాస్ అథవాలే, పెమ్మసానిచంద్రశేఖర్ హాజరయ్యారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే,తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం, మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, తెలంగాణా మాజీ గవర్నర్ తమిళసై, సుప్రీంకోర్టు రిటైర్డ్ చీఫ్ జస్టిస్ ఎన్.వి. వెంకట రమణ, రాజ్యసభ ఎంపీ ప్రఫుల్ పటేల్, ఎంపీ ఈటెల రాజేంద్ర, బీజేపీ నేతలు సిద్ధార్థ్‌నాథ్ సింగ్,బీఎల్ సంతోష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరీ ప్రమాణస్వీకార మహెూత్సవానికి విచ్చేశారు.

**తళుక్కుమన్న సినీతారలు**

ప్రమాణస్వీకారోత్సవంలో పలువురు సినీ తారలు తళుక్కుమన్నారు. వేదికపై సూపర్ స్టార్ రజనీకాంత్, మెగాస్టార్ చిరంజీవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఇక ఈఉత్సవాన్ని తిలకించేందుకు హీరోలు రామచరణ్, నారా రోహిత్, నందమూరి కృష్ణ చైతన్య, నిఖిల్, సాయిధరమ్ తేజ్, శివాజీలు వచ్చారు. వీరితోపాటు దర్శకులు బోయపాటి శ్రీనివాస్, క్రిష్, నిర్మాత జి. ఆదిశేషగిరిరావు కూడా పాల్గొన్నారు.

**తరలి వచ్చిన నారా, నందమూరి, కొణిదెల కుటుంబాలు**

ప్రమాణస్వీకారోత్సవానికి నారా,నందమూరి కుటుంబాలు ఒక రోజు ముందే ఉండవల్లి చేరుకున్నారు.అక్కడ చంద్రబాబు నివాసంనుండి ఉదయాన్నే బయల్దేరి ప్రమాణస్వీకార మహెూత్సవానికి హాజరయ్యారు. నారా భువనేశ్వరి, నారా బ్రహ్మణీ, నారా దేవాన్ష్, నందమూరి కుటుంబ సభ్యులు రామకృష్ణ, సుహాసిని, వసుంధర తదితరులంతా విచ్చేశారు. వీరితోపాటు బాలకృష్ణ చిన్న కూతురు తేజస్విని, ఆమె భర్త, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ కూడా హాజరయ్యారు. మెగా కుటుంబం మొత్తం ఒకరోజు ముందే విజయవాడకు చేరుకున్నారు. పవన్‌కళ్యాణ్ సతీమణి అన్నా లెజినోవా, ఆయన పిల్లలు అకీరా, ఆద్యా, నాగబాబు, ఆయన సతీమణి పద్మజ, వారి అమ్మాయి నిహారిక, చిరంజీవి కూతురు శ్రీజ ఇతర కటుంబ సభ్యులు ప్రమాణస్వీకారోత్సవంలో పాల్గొని సందడి చేశారు.

ఏపీ సీఎం చంద్రబాబు ప్రమాణస్వీకార కార్యక్రమానికి పలువురు విదేశీ అతిథులు హాజరయ్యారు. వివిధ దేశాల తరపున కాన్సుల్ ప్రతినిధులు వచ్చారు. వీరిలో సింగపూర్, అమెరికా, జపాన్, ఫ్రాన్స్, నెదర్లాండ్స్ తదితర దేశాల ప్రతినిధులు ఉన్నారు. ఎడ్గర్ పాంగ్ (సింగపూర్ కాన్సుల్ జనరల్, చెన్నై), సిలాయ్ జకీ (ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్), చాంగ్ న్యూన్ కిమ్ (రిపబ్లిక్ ఆఫ్ కొరియా కాన్సుల్ జనరల్, చెన్నై), ట్రకహషి మునియో (జపాన్ కాన్సుల్ జనరల్, చెన్నై), గ్లారెత్ విన్ ఓవెన్ (బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్, హైదరాబాద్), థియర్రీ బెర్తలాట్ (ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్, బెంగళూరు), మహ్మద్ అరిఫుర్ రెహమాన్ (బంగ్లాదేశ్ డిప్యూటీ కాన్సుల్ జనరల్, చెన్నై), ఇవోట్ డెవిత్ (నెదర్లాండ్స్ కాన్సుల్ జనరల్, ముంబయి), జెన్నిఫర్ అడ్రియానా లార్సన్ (యూఎస్ కాన్సుల్ జనరల్, హైదరాబాద్), మహదీ షారోఖీ (కాన్సుల్ జనరల్ ఆఫ్ ఇరాన్, హైదరాబాద్), సెంథిల్ తొండమాన్ (గవర్నర్, ఈస్ట్రన్ ప్రావిన్స్, శ్రీలంక) హాజరైయారు.

# అవధుల్లేని ఆనందం



## భువనేశ్వరి నుదుటిపై బాలయ్య ముద్దు

గన్నవరం: చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవంలో నందమూరి బాలకృష్ణ ఎంతో ఉత్సాహంగా అన్నీ తానై వ్యవహరించారు. వేదికపైకి అతిథులను ఆహ్వానించడం, వారికి సరైన సదుపాయాలు అందేలా చూడడం వంటి పనులతో బాలయ్య బిజీగా కనిపించారు. ఈ క్రమంలో ఆయన తన సోదరి నారా భువనేశ్వరి నుదుటిపై ఆప్యాయంగా ముద్దాదారు. అవధుల్లేని ఆనందాన్ని ఎవరైనా సరే కుటుంబ సభ్యులతోనే షేర్ చేసుకుంటారు. దీనికి ఎవరూ అతీతులు కారు. సరిగ్గా సినీ నటుడు, హిందూపురం బాలకృష్ణ విషయంలో ఇదే జరిగింది. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంతో కార్యక్రమానికి బాలకృష్ణ హాజరయ్యారు. ప్రమాణ స్వీకార వేదికపై చంద్రబాబు నాయుడు సతీమణి, బాకల్కృష్ణ సోదరి భువనేశ్వరి ఉన్నారు. ఆమెను చూసిన వెంటనే బాలకృష్ణ. భువనేశ్వరి నుదుటిపై ముద్దు పెట్టి ఆత్మీయంగా పలకరించారు. భువనేశ్వరిని ఆ వేదికపై చూసి ఎమోషనల్ అయిన బాలకృష్ణ. సోదరుడిగా నుదుటిపై ముద్దు పెట్టి తన సంతోషాన్ని పంచుకున్నారు. బాలకృష్ణకు సంబంధించిన ఈ దృశ్యం సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. అలాగే నందమూరి బాలకృష్ణ సభ మొత్తం తిరుగుతూ అందరినీ పలకరిస్తూ, తన అక్కలు ఇద్దరినీ ఎంతో ఆప్యాయంగా పలకరించారు.

**నా సంతోషాన్ని రెట్టింపు చేశావు: భువనేశ్వరి**

దీనిపై నారా భువనేశ్వరి సోషల్ మీడియా ద్వారా స్పందించారు. ఒక భార్యగా, ఒక అమ్మగా నా మనసు ఆనందంతో నిండిన క్షణాల్లో... నాకు తోడబుట్టిన ప్రేమను పంచుతూ నా సంతోషాన్ని రెట్టింపు చేశావు బాలా అన్నయ్యా... అంటూ భువనేశ్వరి ట్వీట్ చేశారు. దీనికి సంబంధించిన వీడియోను కూడా ఆమె పంచుకున్నారు.

# ఉద్యమాన్ని ముగించిన రాజధాని రైతులు



అమరావతి: రాజధాని అమరావతిని కాపాడుకునేందుకు దీర్ఘకాలంగా ఉద్యమిస్తున్న రాజధాని రైతులు దీక్షా శిబిరాలకు ముగింపు పలికారు. అమరావతిని ఏకైక రాజధానిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ 1881 రోజులుగా రాజధాని ప్రాంతంలోని రైతులు దీక్ష చేస్తున్న విషయం తెలిసిందే. జగన్ మూడు రాజధానుల ప్రకటన చేసినప్పటి నుంచి రైతులు పోరుబాట పట్టారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టడంతో రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంతో అమరావతికి పూర్వ వైభవం వస్తుందన్న నమ్మకంతో దీక్షా శిబిరాలను తొలగిస్తున్నట్టు ప్రకటించారు. ఉద్యమంలో మొదటి నుంచి వెన్నుదన్నుగా నిలిచిన మీడియాకు రాజధాని రైతులు ప్రత్యే కృతజ్ఞతలు తెలిపారు.

**చంద్రబాబు ప్రమాణ స్వీకారంతో సంబరాలు**

ఏపీ సీఎంగా తెదేపా అధినేత చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయడంతో గుంటూరు జిల్లా తుళ్లూరులో రాజధాని ప్రాంత రైతులు, మహిళలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తెరపై అమరావతి రూపకర్త చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవాన్ని వీక్షించారు. అమరావతి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో దీన్ని ఏర్పాటు చేశారు. జై అమరావతి, జై చంద్రబాబు నినాదాలతో హెూరెత్తించారు. చంద్రబాబు ప్రమణ స్వీకారంతో రాజధాని రైతులు సంబరాలు చేసుకున్నారు.



# ఏపీని నవశకం దిశగా నడిపిస్తాం: మోదీ

**నూతన ప్రభుత్వానికి ఆశీస్సుల అందజేత**

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని నవశకం దిశగా నడిపించేందుకు సంపూర్ణంగా కట్టుబడి ఉన్నామని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. గన్నవరం వద్ద జరిగిన చంద్రబాబు, మంత్రుల ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన మోదీ నూతన ప్రభుత్వానికి ఆశీస్సులు అందజేశారు. అనంతరం మోదీ సోషల్ మీడియాలో స్పందించారు. ఏపీలో కొత్త ప్రభుత్వ ప్రమాణ స్వీకార వేడుకకు హాజరయ్యాను. ఏపీ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన చంద్రబాబుకు, మంత్రులుగా ప్రమాణం చేసిన ఇతరులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ఏపీకి ఉజ్వలమైన భవిష్యత్తును అందించేందుకు, మరింత అభివృద్ధి దిశగా నడిపించేందుకు,టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం సంపూర్ణంగా కట్టుబడి ఉంది. యువత ఆశలను ఈ ప్రభుత్వం నెరవేర్చుతుందని స్పష్టం చేశారు.

## లోకేష్‌కు మోదీ శుభాకాంక్షలు



గన్నవరం: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్ ఏపీ మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. లోకేష్ ప్రమాణ స్వీకారం అనంతరం తండ్రి చంద్రబాబుకు పాదాభివందనం చేసి ఆశీస్సులు అందుకున్నారు. తరువాత గవర్నర్ అబ్దుల్ నజీర్ పాదాలకు నమస్కరించి ఆయన ఆశీస్సులు కూడా అందుకున్నారు. ప్రధాని మోదీ, అమిత్ షాలకు కూడా లోకేశ్ పాదాభివందనం చేసేందుకు యత్నించగా, వారు వద్దని సున్నితంగా వారించారు. రెండో పర్యాయం మంత్రిగా బాధ్యతలు అందుకోబోతున్న లోకేష్‌కు ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు అమిత్ షా, నితిన్ గడ్కరీ, జేపీ నడ్డా శుభాకాంక్షలు తెలిపారు.

**ఏపీ సీఎం చంద్రబాబు ముఖ్య కార్యదర్శిగా**

## ముద్దాడ రవిచంద్ర నియామకం

**-ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్**

**-వెంటనే బాధ్యతలు తీసుకోవాలని ఆదేశాలు**



అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ముఖ్య కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి ముద్దాడ రవిచంద్ర నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే బాధ్యతలు తీసుకోవాలని రవిచంద్రకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 1996 బ్యాచ్ ఏపీ కేడర్ ఐఏఎస్ అధికారి రవిచంద్ర సమర్థుడైన అధికారిగా పేరు తెచ్చుకున్నారు. పేరు కోసం పాకులాడకుండా తన విధులను సమర్థవంతంగా నిర్వర్తించడంపైనే దృష్టి కేంద్రీకరిస్తారనే మంచి పేరు ఉంది. వివిధ జిల్లాలకు కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించడంతో పాటు, ప్రభుత్వ యంత్రాగంలో కీలకమైన ఉన్నతస్థాయి పదవుల్లో కూడా రవిచంద్ర తన సామర్థ్యం నిరూపించుకున్నారు. విధానాల రూపకల్పనలోనూ, వాటిని సమర్థవంతంగా అమలు చేయటంలోనూ చక్కటి పనితీరు కనబరుస్తారు. 2003లో రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేసినప్పుడు కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూములను పరిరక్షించటంలో కీలకపాత్ర పోషించారు. తూర్పుగోదావరి, నెల్లూరు జిల్లాల కలెక్టర్‌గా కూడా చక్కటి పనితీరు కనబర్చారు. కోవిడ్ సమయంలో ఆరోగ్యశాఖ కార్యదర్శిగా విధులను సమర్థవంతంగా నిర్వర్తించారు. 2014-19 మధ్య చంద్రబాబు హయాంలో ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేశారు.

చైతన్యరథం

# చంద్రబాబు మార్క్ మంత్రివర్గం

- 24 మందిలో 17 మంది కొత్తవారే
- 9 మంది మొదటిసారి ఎమ్మెల్యేలు
- బడుగు,బలహీన వర్గాలకు సగం శాఖలు
- 8 మంది బీసీలకు పదవులు
- ముగ్గురు మహిళలకు అవకాశం
- 21 మంది పట్టభద్రులు
- జనసేనకు మూడు, బీజేపీకి ఒకటి కేటాయింపు
- 1983 బ్యాచ్‌కి ప్రాతినిధ్యం లేని తొలి టీడీపీ మంత్రి వర్గం



అమరావతి, చైతన్యరథం: ముఖ్యమంత్రిగా నాలుగో సారి బాధ్యతలు చేపట్టిన నారా చంద్రబాబునాయుడు ఈసారి మంత్రి వర్గంలో తన మార్క్ చూపించారు. గత మూడుసార్లు మంత్రివర్గ ఎంపికలో సంప్రదింపులు, సలహాలు, ఒత్తిళ్ల ప్రభావం ఎక్కువగా ఉండగా... ఈ సారి మాత్రం పూర్తిగా తన స్వేచ్ఛ మేరకు చంద్రబాబు మంత్రివర్గాన్ని ఎంచుకున్నారు. ఎటువంటి మొహమాటాలకు, సిఫార్సులకు తావు లేకుండా అటు రాష్ట్రానికి, ఇటు పార్టీకి సుదీర్ఘ కాలం సమర్ధ నాయకత్వం అందించాలనే లక్ష్యంతో యువకులకు ఎక్కువ అవకాశం కల్పించారు. అందులోనూ మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచిన వారికి ప్రాధాన్యత నిచ్చారు. మొత్తం 24మంది మంత్రుల్లో అటు పాత, కొత్తల కలయికతో తనదైన టీమ్‌ను ఎంపిక చేసుకున్నారు. గతంలో మంత్రిగా పని చేసిన అనుభవం ఉన్నవారు ఏడుగురు ఉన్నారు. నారా లోకేష్, అచ్చెన్నాయు డు, కొలుసు పార్ధసారధి, ఆనం రాంనారాయణరెడ్డి, పి.నారాయణ, కొల్లు రవీంద్ర, ఎన్ఎండి ఫరూక్‌లు గతంలో మంత్రులుగా పని చేశారు. మిగిలిన 17 మంది మొదటిసారిగా మంత్రి పదవులు పొందినవారు. వీరిలోనూ తొమ్మిది మంది మొదటిసారిగా ఎమ్మెల్యేగా గెలిచిన వారు ఉన్నారు. పవన్ కళ్యాణ్, సత్యకుమార్, కందుల దుర్గేష్, గుమ్మిడి సంధ్యారాణి, టీజీ భరత్, ఎస్.సవిత, వాసంశెట్టి సుభాష్, కొండపల్లి శ్రీనివాస్, మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి ఈ జాబితాలో ఉన్నారు. మంత్రి పదవులు ఇవ్వడంలో చంద్రబాబు వందకు వందశాతం సామాజిక న్యాయం పాటించారు. మొత్తం పదవుల్లో సగం పదవులు బడుగు, బలహీన వర్గాలకు కేటాయించారు. ఇందులో అత్యధికంగా బీసీలకు ఎనిమిది మంత్రి పదవులు, ఎస్సిలకు రెండు, ఎస్టీలకు ఒకటి, ముస్లీమ్ మైనార్టీలకు ఒకటి ఇచ్చారు. మిగిలిన వారిలో కాపులకు నాలుగు, రెడ్లకు మూడు, కమ్మలకు నాలుగు, వైశ్యులకు ఒకటి కేటాయించారు. మంత్రివర్గంలో ఉన్న వారిలో ముగ్గురు తప్ప మిగిలిన వారంతా పట్టభద్రులు, ఆపైన విద్యార్హతలు ఉన్నవారే. అందరి కన్నా చిన్న వయస్కురాలుగా వంగలపూడి అనిత(40) ఉండగా... అందరి కన్నా వయస్సులో పెద్దవాడుగా ఎన్ఎండి ఫరూక్(74) ఉన్నారు. మొత్తం 24మందిలో ముగ్గురు మహిళలకు అవకాశం ఇచ్చారు. 1983బ్యాచ్‌కు చెందినవారు ఒక్కరుకూడా మంత్రిగా లేకుండా ఏర్పడిన మొదటి మంత్రివర్గం ఇదే కావడం గమనార్హం.

ఈ మంత్రివర్గంలో జనసేనకు మూడు, బిజేపీకి ఒక పదవి కేటాయించారు. నిబంధనల ప్రకా రం మొత్తం 26మందితో మంత్రివర్గం ఉండొచ్చు. ఇప్పటి వరకు చంద్రబాబుతో కలిపి 25మందితో మంత్రివర్గం ఏర్పడింది. మిగిలిన ఒక్క పదవికి ఎవరికి ఇస్తారనేది ఉత్కంఠగా మారింది. మిత్రపక్షాలకు ఇస్తారా..లేదా టీడీపీనే అట్టిపెట్టుకుంటుందా అనేది కొద్ది రోజుల్లో తేలనుంది. కాగా మంత్రులకు శాఖలను ఈరోజు కేటాయిస్తానని చంద్రబాబు తెలిపారు.

## మంత్రులు - సామాజిక నేపథ్యం

| | | |
|---|---|---|
| బీసీ | - | అచ్చెన్నాయుడు(కొప్పులవెలమ) |
| | | కొల్లు రవీంద్ర(మత్స్యకార) |
| | | కొలుసు పార్ధసారథి(యాదవ) |
| | | అనగాని సత్యప్రసాద్(గౌడ) |
| | | సత్యకుమార్(యాదవ) |
| | | కొండపల్లి శ్రీనివాస్(తూర్పుకాపు) |
| | | వాసంశెట్టి సుభాష్(శెట్టి బలిజ) |
| | | ఎస్.సవిత(కురుబ) |
| ఎస్‌సి | - | వంగలపూడి అనిత(మాల) |
| | | డోల బాలవీరాంజనేయస్వామి(మాదిగ) |
| ఎస్‌టి | - | గుమ్మడి సంధ్యారాణి |
| ముస్లిం | - | ఎన్ఎండి ఫరూక్ |
| వైశ్య | - | టీజీ భరత్ |
| రెడ్డి | - | ఆనం రాంనారాయణరెడ్డి |
| | - | బీసీ జనార్ధన్‌రెడ్డి |
| | - | మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి |
| కాపు | - | పవన్ కళ్యాణ్ |
| | - | పి.నారాయణ |
| | - | నిమ్మల రామానాయుడు |
| | - | కందుల దుర్గేష్ |
| కమ్మ | - | నారా లోకేష్ |
| | - | నాదెండ్ల మనోహర్ |
| | - | పయ్యావుల కేశవ్ |
| | - | గొట్టిపాటి రవికుమార్ |

## వేదికపైకి చిరంజీవికి స్వాగతం పలికిన బాలయ్య



గన్నవరం: చంద్రబాబు ప్రమాణస్వీకార కార్యక్రమానికి విచ్చేసిన మెగాస్టార్ చిరంజీవికి వేదికపై నందమూరి బాలకృష్ణ స్వాగతం పలికారు. చిరుకు బాలయ్య స్వాగతం పలికిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. అనంతరం వేదికపైకి వస్తున్న సూపర్‌స్టార్ రజనీకాంత్‌కు కూడా బాలకృష్ణ స్వాగతం పలికారు.

## వీల్‌చైర్‌లో వచ్చిన పులివర్తి నాని



గన్నవరం: చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని వీల్‌చైర్‌లో హాజరయ్యారు. అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా వైసీపీ నేతల దాడిలో టీడీపీ నాయకుడు పులివర్తి నాని గాయపడిన విషయం తెలిసిందే. ఆ గాయాల నుంచి నాని ఇంకా కోలుకోలేదు. అయితే, తాజాగా చంద్రబాబు ప్రమాణస్వీకార కార్యక్రమానికి పులివర్తి నాని హాజరయ్యారు. కాలికి పట్టీతో వీల్ చెయిర్ లో వచ్చారు. కేసరపల్లి సభావేదిక వద్దకు పులివర్తి నాని వీల్ చెయిర్ లో వస్తున్న వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసిన తర్వాత చంద్రగిరి నియోజకవర్గ కూటమి అభ్యర్థి పులివర్తి నాని స్ట్రాంగ్ రూమ్ ల పరిశీలనకు వెళ్లారు. తిరుపతిలోని పద్మావతి మహిళా వర్సిటీలో స్ట్రాంగ్ రూమ్ ను పరిశీలించి తిరిగి వస్తుండగా.. వైసీపీ శ్రేణులు నానిపై దాడికి దిగాయి.

# ప్రమాణస్వీకార వేదికపై ఆసక్తికర సన్నివేశం

- మెగా సోదరులతో కలిసి ప్రజలకు అభివాదం చేసిన ప్రధాని
- మోదీని సూపర్ స్టార్ రజనీకాంత్ వద్దకు తోడ్కొని వెళ్లిన చంద్రబాబు



గన్నవరం: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమాణస్వీకార వేదికపై ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. మెగా సోదరులను ప్రధాని నరేంద్ర మోదీ ఆప్యాయంగా పలకరించారు. ఆపై మెగస్టార్ ఓవైపు, పవర్ స్టార్‌ను మరోవైపు నిలబెట్టుకుని సభకు హాజరైన ప్రజలకు అభివాదం చేశారు. దీంతో మెగా అభిమానులు చప్పట్లతో హర్షం వ్యక్తంచేశారు. వేదికపై ఆ ముగ్గురిని పక్కపక్కనే చూసి అభిమానులు చేసిన కరతాళ ధ్వనులతో సభా ప్రాంగణం మార్మోగింది. వేదికపై ప్రధాని మోదీతో నాన్న, బాబాయ్‌లను మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ సంతోషంగా చూస్తుండదం కనిపించింది.

అంతకుముందు సీఎం, మంత్రుల ప్రమాణ స్వీకారం పూర్తయ్యాక ప్రధాని నరేంద్ర మోదీతో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఫొటోలకు పోజిచ్చారు. మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన పవన్‌ను మోదీ అభినందించారు. అపై ప్రధాని మోదీని పవన్ కల్యాణ్ తన సోదరుడు చిరంజీవి వద్దకు తోడ్కొని వెళ్లారు. మెగా సోదరులు ఇద్దరినీ దగ్గరకు తీసుకున్న మోదీ.. వేదిక పైనుంచి ప్రజలకు అభివాదం చేశారు. అనంతరం ఏపీ సీఎం చంద్రబాబు ప్రధాని మోదీని సూపర్‌స్టార్ రజనీకాంత్ వద్దకు తీసుకువెళ్లారు. రజనీకాంత్ తో పాటు పక్కనే ఉన్న బాలకృష్ణను మోదీ పలకరించి, వారితో కరచాలనం చేశారు. తర్వాత ఒక్కొక్కరిగా వేదికపై ఉన్న ఎన్డీయే కూటమి నేతలను, కేంద్ర మంత్రులను, మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడులతో ప్రధాని నరేంద్ర మోదీ కరచాలనం చేశారు.

### గర్వంగా ఉందన్న చిరంజీవి

తన తమ్ముడు పవన్ కల్యాణ్ ఏపీ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం పట్ల మెగాస్టార్ చిరంజీవి స్పందించారు. గుండెల నిండా సంతోషంగా ఉందని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మంచి భవిష్యత్ ఉందన్న భరోసా కలుగుతోందని తెలిపారు. రాష్ట్రంలో సమర్థులు, సుదీర్ఘ పాలనా అనుభవం, శక్తిసామర్థ్యాలు ఉన్న నాయకులు వచ్చారని కొనియాడారు. పాత-కొత్త కలయికలో ఈ మంత్రివర్గం చాలా చాలా బాగుందని కితాబునిచ్చారు. గతంలో ఎన్నడూ లేనంత అభివృద్ధిని ఇప్పుడుచూస్తారని చిరంజీవి ధీమా వెలిబుచ్చారు. తన తమ్ముడు ఏపీ మంత్రిగా ప్రమాణస్వీకారం చేయడం పట్ల గర్వంగా అనిపిస్తోందని అన్నారు. ఎంతో కష్టపడిన తర్వాత వచ్చిన విజయం కావడంతో దీనికి ఎంతో ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వంలో తన పాత్రను సమర్థంగా నిర్వర్తించగలదని, రాష్ట్ర భవిష్యత్తు కోసం పూర్తి స్థాయిలో పని చేస్తాడని తమ్ముడిపై నమ్మకం వ్యక్తం చేశారు.

పవన్ కల్యాణ్ ప్రమాణ స్వీకారోత్సవానికి విచ్చేసిన మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ కూడా మీడియాతో మాట్లాడటారు. ఎంతో ఆనందంగా ఉందని అన్నారు.తమకు ఇది మహోజ్వలమైన రోజు అని అభివర్ణించారు. పిఠాపురంలో తన బాబాయ్ పవన్ కల్యాణ్ సాధించింది 100 శాతం చారిత్రక విజయం అని రామ్ చరణ్ అభిప్రాయపడ్డారు. ఏపీలో కొలువుదీరిన కొత్త ప్రభుత్వానికి అంతా మంచే జరగాలని కోరుకుంటున్నానని తెలిపారు.

### వేదికపైనే చిరంజీవికి పవన్ పాదాభివందనం

జనసేనాని పవన్ కళ్యాణ్ రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంలో సభా ప్రాంగణం చప్పట్లు, కేకలు, ఈలలతో మార్మోగింది. కొణిదెల పవన్ కల్యాణ్ అనే నేను.. అంటూ పవన్ పలకగానే ఆయన అభిమానులు, జనసేన కార్యకర్తల సంతోషం మిన్నంటింది. పవన్ ప్రమాణస్వీకారం చేస్తుండగా ఆయన భార్య అన్నా లెజనోవా, సోదరుడు చిరంజీవి ముఖాల్లో సంతోషం వెల్లివిరిసింది. ప్రమాణం పూర్తయ్యాక వేదికపై ఉన్న చంద్రబాబు దగ్గరికి వెళ్లిన పవన్ కల్యాణ్ ఆయనతో కరచాలనం చేశారు. ఈ సందర్భంగా పవన్‌ను చంద్రబాబు అభినందించారు. ఆపై వేదికపై ఉన్న గవర్నర్, ఇతర ప్రముఖులకు ఆంధ్రప్రదేశ్ మంత్రి పవన్ కల్యాణ్ నమస్కరించారు. అన్న చిరంజీవికి పాదాభివందనం చేసి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు.

చైతన్యరథం

# కొలువుదీరిన కొత్త ప్రభుత్వం



ఆంధ్రప్రదేశ్ నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన నారా చంద్రబాబునాయుడు



ముఖ్యమంత్రిగా చంద్రబాబుతో పాటు ప్రమాణస్వీకారం చేసిన కేబినేట్ మంత్రులతో ప్రధాని నరేంద్ర మోదీ, గవర్నర్ అబ్దుల్ నజీర్ గ్రూప్ ఫోటో



కొణిదెల పవన్ కళ్యాణ్



నారా లోకేష్



కింజరాపు అచ్చెన్నాయుడు



కొల్లు రవీంద్ర



నాదెండ్ల మనోహర్



పొంగూరు నారాయణ



వంగలపూడి అనిత



సత్యకుమార్ యాదవ్



నిమ్మల రామానాయుడు



ఎన్.ఎమ్.డి.ఫరూక్



ఆనం రామనారాయణరెడ్డి



పయ్యావుల కేశవ్



అనగాని సత్యప్రసాద్



కొలుసు పార్థసారథి



డోలా బాలవీరాంజనేయస్వామి



గొట్టిపాటి రవి



కందుల దుర్గేష్



గుమ్మడి సంధ్యారాణి



బీసీ జనార్థన్ రెడ్డి



టీజీ భరత్



ఎస్.సవిత



వాసంశెట్టి సుభాష్



కొండపల్లి శ్రీనివాస్



మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి

# కొత్త మంత్రుల వివరాలు

గన్నవరం: రాష్ట్రంలో నూతన ప్రభుత్వం కొలువుదీరింది. రాష్ట్ర ముఖ్యమంత్రిగా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. ఆయనతో పాటు పవన్ కళ్యాణ్, లోకేష్, అచ్చెన్నాయుడు సహా మరో 24 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. వీరిలో టీడీపీ నుంచి 20 మంది ఉండగా.. జనసేన నుంచి ముగ్గురు, భాజపా నుంచి ఒకరు చొప్పున ఉన్నారు. సగానికిపైగా కొత్తవారికే అవకాశం దక్కింది. ముగ్గురు మహిళలకు చోటు కల్పించారు. కొత్త మంత్రుల వివరాలివే..



## కొణిదెల పవన్ కల్యాణ్ (జనసేన)

నియోజకవర్గం : పిఠాపురం (కాకినాడ జిల్లా)
వయసు : 56 ఏళ్లు
విద్యార్హత : ఇంటర్మీడియట్

**రాజకీయ అనుభవం:** సినీ నటుడిగా 1996లో తెరంగేట్రం చేసిన పవన్ కల్యాణ్ పవర్ స్టార్ ఇమేజ్‌తో భారీ సంఖ్యలో అభిమానులను సొంతం చేసుకున్నారు. 2008లో రాజకీయాల్లోకి వచ్చారు. సోదరుడు మెగాస్టార్ చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీలో యువ విభాగం అధ్యక్షుడిగా వ్యవహరించారు. కామన్మెన్ ప్రొటెక్షన్ ఫోర్స్ (సీఎంపీఎఫ్) ట్రస్ట్ ద్వారా సేవలందించారు. కాంగ్రెస్‌లో ప్రజారాజ్యం పార్టీ విలీనం కావటంతో బయటకు వచ్చి.. 2014లో జనసేన పార్టీని స్థాపించారు. అప్పటి ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండి.. భాజపా, తెదేపాకు మద్దతు పలికి కూటమి అధికారంలోకి రావడంలో కీలకంగా వ్యవహరించారు. 2019లో బీఎస్పీ, వామపక్షాలతో పొత్తు పెట్టుకున్నారు.
ఆ ఎన్నికల్లో భీమవరం, గాజువాకలో పోటీ చేసి రెండుచోట్లా ఓటమి పాలైనా వెనకడుగు వేయకుండా ధైర్యంగా నిలబడి పోరాడారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదన్న ఏకైక అజెండాతో కూటమి ఏర్పాటులో కీలకంగా వ్యవహరించారు. చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసిన సమయంలో రాజమహేంద్రవరం జైలులో ఆయన్ను కలుసుకొని బయటకు వచ్చిన పవన్.. క్లిష్టపరిస్థితుల్లో టీడీపీతో పొత్తు పెట్టుకుంటున్నట్లు ప్రకటించారు. 2024 ఎన్నికల్లో ఎన్డీయే కూటమిలో భాగంగా పోటీ చేసిన 21 అసెంబ్లీ, 2 పార్లమెంట్ స్థానాలన్నింటిలోనూ జనసేనకు రికార్డు విజయాన్ని అందించారు.



## నారా లోకేష్ (తెదేపా)

నియోజకవర్గం : మంగళగిరి (గుంటూరు జిల్లా)
వయసు : 41 ఏళ్లు
విద్యార్హత : స్టాన్ఫోర్డ్ యూనివర్సిటీ నుంచి ఎంబీఏ

**రాజకీయ అనుభవం:** తండ్రి నారా చంద్రబాబు అడుగుజాడల్లో రాజకీయాల్లోకి అడుగు పెట్టిన లోకేష్ తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. 2017లో ఎమ్మెల్సీగా ఎన్నికై.. చంద్రబాబు మంత్రివర్గంలో ఐటీ, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రిగా పనిచేశారు.ఏపీలో ఐటీ కంపెనీల స్థాపనకు కృషి చేశారు. 2019 ఎన్నికల్లో మంగళగిరి నుంచి పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు. 2023 జనవరిలో యువగళం పాదయాత్ర చేపట్టారు.రాష్ట్రవ్యాప్తంగా 3వేల కిలోమీటర్లకు పైగా పాదయాత్ర నిర్వహించి ప్రజల కష్టాలు విన్నారు. పార్టీ బలోపేతానికి పని చేశారు. తాజా ఎన్నికల్లో మంగళగిరి నుంచి పోటీ చేసి 91వేలకు పైగా మెజార్టీతో ఘన విజయం సాధించారు.



## కొల్లు రవీంద్ర (తెదేపా)

నియోజకవర్గం : మచిలీపట్నం (కృష్ణా జిల్లా)
వయసు : 51 ఏళ్లు
విద్యార్హత : బీఏ, ఎల్ఎల్బీ

**రాజకీయ అనుభవం:** ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా పనిచేసిన దివంగత నేత ఎన్. నరసింహారావు అల్లుడైన రవీంద్ర ఆయన వారసునిగా 2005లో రాజకీయాల్లోకి ప్రవేశించారు. తెదేపా డివిజన్ అధ్యక్షుడిగా, 2007లో తెలుగుయువత జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. 2015 నుంచి కొల్లు ఫౌండేషన్ ద్వారా సేవాకార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం పొలిట్‌బ్యూరో సభ్యుడిగా, పార్టీ బీసీ సాధికార రాష్ట్ర కన్వీనర్‌గా, బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 2014లో చంద్రబాబు హయాంలో ఎక్సైజ్, చేనేత, బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేశారు. గత ఎన్నికల్లో ఓటమిపాలైనా.. తాజాగా మచిలీపట్నం నుంచి భారీ మెజార్టీతో గెలిచారు.



## కింజరాపు అచ్చెన్నాయుడు (తెదేపా)

నియోజకవర్గం : టెక్కలి (శ్రీకాకుళం జిల్లా)
వయసు : 54 ఏళ్లు
విద్యార్హత : డిగ్రీ (బీఎస్సీ)

**రాజకీయ అనుభవం:** 1995లో హరిశ్చంద్రాపురం ఎమ్మెల్యేగా తొలిసారి ఎన్నికైన అచ్చెన్నాయుడు 1999, 2004 ఎన్నికల్లోనూ గెలుపొందారు. 2009 నియోజకవర్గాల పునర్విభజన నేపథ్యంలో ఏర్పడిన టెక్కలి నుంచి పోటీచేసి ఓడిపోయారు. ఆ తర్వాత 2014లో అదే సీటు నుంచి గెలుపొంది ఐదేళ్లపాటు మంత్రిగా పనిచేశారు. 2019 ఎన్నికల్లో గెలిచినప్పటికీ పార్టీ అధికారం కోల్పోవడంతో శాసనసభాపక్ష ఉపనేతగా వ్యవహరించారు. 2021లో పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా నియమితులయ్యారు. తాజా ఎన్నికల్లో 34వేల పైచిలుకు ఓట్లతో గెలుపొందారు.



## నాదెండ్ల మనోహర్ (జనసేన)

నియోజకవర్గం : తెనాలి (గుంటూరు జిల్లా)
వయసు : 60 ఏళ్లు
విద్యార్హత : ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎంబీఏ

**రాజకీయ అనుభవం:** 2004లో తెనాలి నుంచి కాంగ్రెస్‌పార్టీ తరఫున శాసనసభకు ఎన్నికయ్యారు. 2009లో రెండోసారి విజయం సాధించి ఉమ్మడి రాష్ట్ర శాసనసభలో డిప్యూటీ స్పీకర్‌గా పని చేశారు. 2011లో శాసన సభ స్పీకర్‌గా ఎన్నికై 2014 వరకు ఆ పదవిలో కొనసాగారు. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన మనోహర్ ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత 2018లో జనసేనలో చేరారు. ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్‌గా ఉన్నారు. 2019 ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. 2024లో జనసేన అభ్యర్థిగా బరిలోకి దిగి 50 వేల ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. ఇప్పుడు రాష్ట్ర మంత్రిగా మొదటిసారి అవకాశం దక్కించుకున్నారు.



## డాక్టర్ పొంగూరు నారాయణ (తెదేపా)

నియోజకవర్గం : నెల్లూరు నగరం (నెల్లూరు జిల్లా)
వయసు : 68 ఏళ్లు
విద్యార్హత : ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ. 1977లో స్టాటిస్టిక్స్‌లో బంగారు పతకం సాధించారు.

**రాజకీయ అనుభవం:** ఆసియాలోనే అతి పెద్ద విద్యాసంస్థను ఏర్పాటుచేసిన విద్యావేత్త నారాయణ.. నెల్లూరులోని వీఆర్ కాలేజీలో పార్ట్ టైం లెక్చరర్‌గా పనిచేశారు. 1979లో ఓ చిన్న అద్దె గదిలో నారాయణ ట్యూషన్ సెంటర్‌ను మొదలుపెట్టారు. అదే నేడు నారాయణ విద్యాసంస్థలుగా 14 రాష్ట్రాల్లో 4 లక్షల మందికి పైగా విద్యార్థులకు విద్యను అందిస్తోంది. 1998లో చంద్రబాబుతో పరిచయం డాక్టర్ నారాయణను రాజకీయాల వైపు తిప్పింది. తొలుత టీడీపీ సర్వే విభాగానికి పనిచేసి.. క్రమంగా క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చారు. 2014లో చంద్రబాబు హయాంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి, అర్బన్ హౌసింగ్ శాఖల మంత్రిగా చేశారు. నెల్లూరు నారాయణ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో రోజుకు దాదాపు 13 వందల మంది నిరుపేద రోగులకు ఉచితంగా వైద్య సేవలందిస్తున్నారు.



## అనిత వంగలపూడి (తెదేపా)

నియోజకవర్గం : పాయకరావుపేట (అనకాపల్లి జిల్లా)
వయసు : 45 ఏళ్లు
విద్యార్హత : ఆంధ్రా యూనివర్సిటీ నుంచి మాస్టర్స్ ఆఫ్ ఆర్ట్స్ లిటరేచర్, అంబేద్కర్ యూనివర్సిటీ నుంచి మాస్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్

**రాజకీయ అనుభవం:** ఉమ్మడి విశాఖ జిల్లా రాజవరంలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూనే అనిత రాజకీయాల్లోకి అడుగు పెట్టారు. 2014 ఎన్నికల్లో తొలిసారి పాయకరావుపేట నుంచి పోటీచేసి విజయం సాధించారు. గత ఎన్నికల్లో కొవ్వూరు నుంచి ఓటమిపాలైన తర్వాత ఏపీ తెదేపా మహిళావిభాగం అధ్యక్షురాలిగా పనిచేశారు.ప్రస్తుతం తెదేపా పొలిట్ బ్యూరో సభ్యురాలిగా ఉన్నారు.తాజా ఎన్నికల్లో పాయకరావుపేట నుంచి మరోసారి గెలుపొంది.. ఇప్పుడు మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు.



## నిమ్మల రామానాయుడు (తెదేపా)

నియోజకవర్గం : పాలకొల్లు (పశ్చిమ గోదావరి జిల్లా)
వయసు : 55 ఏళ్లు
విద్యార్హత : ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ

**రాజకీయ అనుభవం:** జిల్లా, రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న రామానాయుడు.. పాలకొల్లును తెదేపాకు కంచుకోటగా మార్చారు. తెలుగుదేశం పార్టీ తరఫున వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 2019లో రాష్ట్రంలో వైకాపాకు అత్యధిక స్థానాలు దక్కినప్పటికీ నిమ్మల 17వేల మెజార్టీతో విజయం సాధించారు. తాజా ఎన్నికల్లోనూ నియోజకవర్గంలో 70శాతం మంది ఓటింగ్ సాధించి.. జిల్లాలోనే అత్యధిక ప్రజాదరణ ఉన్న నేతగా గుర్తింపు పొందారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన రామానాయుడు కొంతకాలం నరసాపురం వైఎన్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేశారు.

## పయ్యావుల కేశవ్ (తెదేపా)



నియోజకవర్గం : ఉరవకొండ (అనంతపురం)
వయసు : 59
విద్యార్హత : ఎంబీఏ

**రాజకీయ అనుభవం:** పయ్యావుల కేశవ్ దాదాపు 30 ఏళ్ల కిందట రాజకీయ అరంగేట్రం చేశారు. 1994లో ఎన్టీఆర్ పిలుపుతో ఉరవకొండ నియోజకవర్గం నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచి, తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1994, 2004, 2009, 2019లో ఎమ్మెల్యేగా పని చేశారు. 2015 నుంచి 2019 వరకు స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీగా పని చేశారు. ఇప్పుడు ఐదోసారి తెదేపా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2019 ఎన్నికల్లో ఫ్యాన్ గాలిని తట్టుకొని ఉరవకొండ నుంచి పయ్యావుల కేశవ్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. దీంతో ఆయనకు తెదేపా అధినేత ప్రజాపద్దుల కమిటీ ఛైర్మన్ గా అవకాశం కల్పించారు. రాజకీయంగా సుదీర్ఘ అనుభవం ఉన్నా, ఇప్పటివరకూ మంత్రిగా అవకాశం రాలేదు. ఎట్టకేలకు మొదటిసారిగా మంత్రి బాధ్యతలు చేపట్టబోతున్నారు.


## గుమ్మిడి సంధ్యారాణి (తెదేపా)



నియోజకవర్గం : సాలూరు (పార్వతీపురం మన్యం జిల్లా)
వయసు : 51
విద్యార్హత : బీఎస్సీ

**రాజకీయ అనుభవం:** రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన సంధ్యారాణి.. తొలుత ఉపాధ్యాయురాలిగా పని చేశారు. తండ్రి జన్ని ముత్యాలు స్ఫూర్తితో పాతికేళ్లకే రాజకీయాల్లోకి అడుగు పెట్టారు. 1999లో కాంగ్రెస్ తరఫున సాలూరు నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. ఆ ఎన్నికల తర్వాత హస్తాన్ని వీడి తెదేపాలో చేరారు. 2009 అసెంబ్లీ, 2014 లోక్‌సభ ఎన్నికల్లోనూ ఓటమి తప్పలేదు. 2015లో తెదేపా నుంచి శాసనమండలికి ఎన్నికయ్యారు. 2020లో తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యురాలిగా నియమితులయ్యారు. ఈసారి సాలూరు నియోజకవర్గంలో మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరపై భారీ విజయం సాధించారు.

## అనగాని సత్యప్రసాద్ (తెదేపా)



నియోజకవర్గం : రేపల్లె (బాపట్ల జిల్లా)
వయసు : 52
విద్యార్హత : డిగ్రీ

**రాజకీయ అనుభవం:** 2009లో తెదేపాలో చేరి రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఆ ఎన్నికల్లో రేపల్లె నుంచి పోటీ చేసి మోపిదేవి వెంకట రమణ చేతిలో ఓడిపోయారు. 2014, 2019లో ఇదే స్థానం నుంచి పోటీచేసి మోపిదేవిని ఓడించారు. తాజా ఎన్నికల్లో వరుసగా మూడోసారి గెలిచి.. ఇప్పుడు చంద్రబాబు మంత్రివర్గంలో స్థానం పొందారు.

## డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి (తెదేపా)



నియోజకవర్గం : కొండపి (ప్రకాశం జిల్లా)
వయసు : 54
విద్యార్హత : ఎంబీబీఎస్

**రాజకీయ అనుభవం:** కొండపి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యునిగా పనిచేసిన వీరాంజనేయస్వామి.. దామచర్ల అంజనేయులు కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో రాజకీయాల్లోకి వచ్చారు. 2014లో తొలిసారి కొండపి స్థానం నుంచి విజయం సాధించారు. అదే నియోజకవర్గం నుంచి వరుసగా మూడు సార్లు గెలిచారు. 2014-19 మధ్య టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడిగా పనిచేశారు. 2019-24 వరకు తెలుగుదేశం శాసన సభాపక్షానికి విప్‌గా వ్యవహరించారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శిగానూ పనిచేశారు.

## బీసీ జనార్దనరెడ్డి (తెదేపా)



నియోజకవర్గం : బనగానపల్లి (నంద్యాల జిల్లా)
వయసు : 55
విద్యార్హత : 8వ తరగతి

**రాజకీయ అనుభవం:** 2014లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2019లో ఓటమిపాలైన ఆయన.. తాజా ఎన్నికల్లో బనగానపల్లి నుంచి 25వేలకు పైగా ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

## గొట్టిపాటి రవికుమార్ (తెదేపా)



నియోజకవర్గం : అద్దంకి (బాపట్ల జిల్లా)
వయసు : 48
విద్యార్హత : ఇంజినీరింగ్

**రాజకీయ అనుభవం:** గ్రానైట్ వ్యాపారి అయిన గొట్టిపాటి 2004లో ప్రకాశం జిల్లా మార్టూరు నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. 2009 నియోజకవర్గాల పునర్విభజనలో మార్టూరు రద్దవ్వడంతో అద్దంకికి మారి అక్కడినుంచి విజయం సాధించారు. 2014లో వైకాపా అభ్యర్థిగా పోటీ చేసి మరోసారి ఎమ్మెల్యే అయ్యారు. 2016లో తెదేపాలో చేరి 2019, 2024 ఎన్నికల్లో గెలిచారు. వైకాపా హయాంలో తీవ్రంగా ఇబ్బంది పడిన వారిలో గొట్టిపాటి రవి ఒకరు. ఆయన వ్యాపారాల్ని గత ప్రభుత్వం దారుణంగా దెబ్బతీసింది. ఇప్పుడు చంద్రబాబు మంత్రివర్గంలో చోటు దక్కడంతో తొలిసారి మంత్రి అవుతున్నారు.

## కందుల దుర్గేష్ (జనసేన)



నియోజకవర్గం : నిడదవోలు (తూర్పుగోదావరి జిల్లా)
వయసు : 50
విద్యార్హత : పోస్టుగ్రాడ్యుయేట్

**రాజకీయ అనుభవం:** కాంగ్రెస్ నుంచి రాజకీయ అరంగేట్రం చేసిన దుర్గేష్. వివిధ హోదాల్లో పనిచేసి ఎమ్మెల్సీ అయ్యారు. తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేశారు. 2014 ఎన్నికల్లో రాజమహేంద్ర వరం లోక్‌సభ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగి ఓటమి పాలయ్యారు. 2018 ఆగస్టు 30న జనసేనలో చేరిన దుర్గేశ్..2019 శాసనసభ ఎన్నికల్లో రాజమహేంద్ర వరం గ్రామీణం నుంచి పోటీచేసి ఓటమిపాలయ్యారు. తాజా ఎన్నికల్లో నిడదవోలు నుంచి నెగ్గి మంత్రివర్గంలో స్థానం సంపాదించుకున్నారు.

## టీజీ భరత్ (తెదేపా)



నియోజకవర్గం : కర్నూలు (కర్నూలు జిల్లా)
వయసు : 48
విద్యార్హత : యూకేలో ఎంబీఏ

**రాజకీయ అనుభవం:** తండ్రి టీజీ వెంకటేశ్ వారసత్వంతో రాజకీయాల్లోకి వచ్చిన భరత్ 2019ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు.అయినా నిరాశ చెందక పట్టుదలతో నిరంతరం జనంలో ఉంటూ వారి సమస్యలుతెలుసుకుని ముందుకు సాగారు.తాజాఎన్నికల్లో గెలిచి తొలిసారి శాసనసభలో అడుగు పెడుతున్నారు.

## ఎస్. సవిత (తెదేపా)



నియోజకవర్గం : పెనుకొండ (శ్రీసత్యసాయి జిల్లా)
వయసు : 47
విద్యార్హత : బీఏ

**రాజకీయ అనుభవం:** సవిత తండ్రి ఎస్ రామచంద్రారెడ్డి అప్పట్లో ఎంపీగా, మంత్రిగా పని చేశారు. ఆయన వారసురాలిగా రాజకీయాల్లోకి అడుగుపెట్టిన సవిత తాజా ఎన్నికల్లో తొలిసారి పోటీ చేశారు. వైకాపా ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న ఉషశ్రీచరణ్‌పై 33 వేల మెజార్టీతో విజయం సాధించారు. తండ్రి పేరుతో ఎస్ఆర్ఆర్ ఛారిటబుల్ ట్రస్టు ఏర్పాటుచేసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 2017-19 వరకు రాష్ట్ర కురుబ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్‌గా పనిచేశారు. పెనుకొండ పట్టణంలో కొన్నేళ్లుగా అన్న క్యాంటీన్ నిర్వహిస్తూ రూ.5 భోజనం అందిస్తున్నారు. నాలుగేళ్ల నుంచి మైనార్టీలకు రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్నారు. రాష్ట్రంలో కురుబ సామాజికవర్గం నుంచి సవిత ఒక్కరే ఎమ్మెల్యేగా గెలుపొందారు.

## వాసంశెట్టి సుభాష్ (తెదేపా)



నియోజకవర్గం : రామచంద్రపురం (బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా)
వయసు : 42
విద్యార్హత : బీఎస్సీ, ఎల్ఎల్బీ

**రాజకీయ అనుభవం:** శెట్టి బలిజ సామాజిక వర్గానికి చెందిన సుభాష్ తాత సత్తిరాజు..తండ్రి సత్యం చెరు రెండుదఫాలు చొప్పున అమలాపురం మున్సిపల్ కౌన్సిలర్లుగా పనిచేశారు. తల్లి కృష్ణకుమారి ప్రస్తుతం కౌన్సిలర్. ఎస్ఏఎఫ్ స్వచ్ఛంద సంస్థ సేవాకార్యక్రమాల ద్వారా శెట్టిబలిజ సామాజికవర్గంలో సుభాష్ పట్టు సాధించారు. వైకాపా రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శిగా పనిచేశారు. అమలాపురం అల్లర్ల ఘటన తర్వాత వైకాపా నాయకులతో విభేదాలురావడంతో తెదేపాలో చేరారు. తాజాఎన్నికల్లో తెదేపా అభ్యర్థిగా రామచంద్రపురం నుంచి ఎమ్మెల్యేగా నెగ్గారు.



## కొండపల్లి శ్రీనివాస్ (తెదేపా)

నియోజకవర్గం : గజపతినగరం (విజయనగరం జిల్లా)
వయసు : 42
విద్యార్హత : కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్స్ డిగ్రీ


**రాజకీయ అనుభవం:** కొండపల్లి కుటుంబానికి రాజకీయ నేపథ్యం ఉంది. తాత పైడితల్లి నాయుడు మూడుసార్లు బొబ్బిలి పార్లమెంట్ సభ్యుడిగా గెలిచారు. తండ్రి కొండలరావు మండల పరిషత్ అధ్యక్షుడిగా వ్యవహరించారు. సాఫ్ట్ వేర్ ఇంజినీర్ గా పనిచేసిన శ్రీనివాస్ సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. ఈ ఎన్నికల్లో అనూహ్యంగా తెరపైకి వచ్చిన ఆయన తెదేపా అభ్యర్థిగా పోటీ చేసి.. మంత్రి బొత్స సత్యనారాయణ సోదరుడు బొత్స అప్పల నర్సయ్యపై 24,302 ఓట్ల మెజార్టీతో విజయదుందుభి మోగించారు.



## మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి (తెదేపా)

నియోజకవర్గం : రాయచోటి (అన్నమయ్య జిల్లా)
వయసు : 43
విద్యార్హత : బీడీఎస్


**రాజకీయ అనుభవం:** ఈయన తండ్రి దివంగత ఎమ్మెల్యే మండిపల్లి నాగిరెడ్డి రాయచోటి ఎమ్మెల్యేగా రెండు పర్యాయాలు గెలుపొందారు. రాంప్రసాద్ రెడ్డి పెద్దనాన్న కుమారుడు మండిపల్లి నారాయణరెడ్డి రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేశారు. సమైక్యాంధ్ర పార్టీ తరఫున రాంప్రసాద్ రెడ్డి రాయచోటి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చెందారు. 2023 డిసెంబర్ లో తెదేపాలో చేరారు. ఇటీవలి ఎన్నికల్లో వైకాపాకు గట్టి పట్టున్న రాయచోటిలో 2495 ఓట్ల మెజార్టీతో గడికోట శ్రీకాంత్ రెడ్డిని ఓడించారు.



## ఎన్ఎండీ ఫరూక్ (తెదేపా)

నియోజకవర్గం : నంద్యాల (నంద్యాల జిల్లా )
వయసు : 74
విద్యార్హత : పీయూసీ

**రాజకీయ అనుభవం:** 1981లో నంద్యాల మున్సిపల్ కౌన్సిలర్‌గా రాజకీయ జీవితం ప్రారంభించారు. 1985లో తొలిసారి నంద్యాల ఎమ్మెల్యేగా గెలుపొంది.. అప్పట్లో చక్కెర పరిశ్రమ మంత్రిగా పనిచేశారు. 1994లో రెండోసారి ఎమ్మెల్యేగా ఎన్నికై డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. 1999లో మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొంది, మున్సిపల్ శాఖ, విద్యాశాఖ, ఉర్దూ అకాడమీ మంత్రిగా పనిచేశారు. 2017లో గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 2017-18లో శాసనమండలి ఛైర్మన్ గా బాధ్యతలు నిర్వర్తించారు. 2018-19 మధ్య ఆరోగ్యశాఖ, మైనార్టీ శాఖల మంత్రిగా వ్యవహరించారు.



## కొలుసు పార్థసారథి

నియోజకవర్గం : నూజివీడు (ఏలూరు జిల్లా)
వయసు : 59
విద్యార్హత : బీటెక్

**రాజకీయ అనుభవం:** ఈయనది రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం. తండ్రి కొలుసు పెద్దరెడ్డయ్య మచిలీపట్నం లోక్‌సభ నుంచి రెండు సార్లు ఎంపీగా ఎన్నికయ్యారు. తండ్రి వారసత్వంగా రాజకీయాల్లోకి వచ్చిన ఆయన 2004లో తొలుత వుయ్యూరు నుంచి గెలుపొందారు. ఆ తర్వాత 2009, 2019లో పెనమలూరు నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో మంత్రిగా పనిచేశారు. ఎన్నికలకు కొద్ది నెలల ముందే తెదేపాలో చేరి నూజివీడు నుంచి గెలుపొందారు.



## సత్యకుమార్ యాదవ్ (భాజపా)

నియోజకవర్గం : ధర్మవరం
వయసు : 53
విద్యార్హత : ఎంఏ (పొలిటికల్ సైన్స్)

**రాజకీయ అనుభవం:** విద్యార్థి దశలోనే రాజకీయాలపై ఆసక్తి పెంచుకున్నారు. మదనపల్లిలో చదువుకుంటున్న సమయంలో ఏబీవీపీ తరఫున కళాశాల ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడి వద్ద కొంతకాలం వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేశారు. సత్యకుమార్ సేవలను గుర్తించిన భాజపా 2018లో జాతీయ కార్యదర్శిగా నియమించింది. ప్రస్తుతం ఆయన ఉత్తరప్రదేశ్ రాష్ట్ర పార్టీ వ్యవహారాల సహ ఇన్‌ఛార్జిగా, అండమాన్ నికోబార్ ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్నారు.



## ఆనం రామనారాయణ రెడ్డి (తెదేపా)

నియోజకవర్గం : ఆత్మకూరు (నెల్లూరు జిల్లా)
వయసు : 72
విద్యార్హత : బీకాం, బీఎల్

**రాజకీయ అనుభవం:** 1983లో నెల్లూరు అసెంబ్లీ ఎన్నికల్లో కేవీఎస్ రెడ్డిపై తెదేపా అభ్యర్థిగా విజయం సాధించారు. 1984లో రాష్ట్ర క్రీడామండలి ఛైర్మన్‌గా నియమితులయ్యారు. 1985లో రాపూరు అసెంబ్లీ ఎన్నికల్లో తెదేపా తరఫున గెలుపొంది ఆర్అండ్‌బీ మంత్రిగా పనిచేశారు. 1989 రాపూరు నుంచి ఓడిపోయి.. 1990లో ఏపీ వ్యాయామ ఉపాధ్యాయ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టారు. 1991లో కాంగ్రెస్ పార్టీలో చేరి 1999లో, 2004లోనూ రాపూరు నుంచి మళ్లీ వరుసగా గెలుపొందారు. రాష్ట్ర సమాచార, టూరిజం శాఖ మంత్రిగా పనిచేశారు. 2009 ఎన్నికల్లో ఆత్మకూరు నుంచి గెలిచి మున్సిపల్ మంత్రిగా వ్యవహరించారు.

# మంత్రిగా లోకేష్ ప్రమాణ స్వీకారం

- గర్వపడుతున్నానన్న నారా బ్రాహ్మణి
- ఓ అమ్మగా ఇది నాకు మర్చిపోలేని రోజన్న భువనేశ్వరి





గన్నవరం: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఏపీ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంపై ఆయన సతీమణి నారా బ్రాహ్మణి, మాతృమూర్తి నారా భువనేశ్వరి స్పందించారు. నారా లోకేశ్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం పట్ల నేను చాలా గర్వపడుతున్నాను. నా వరకు ఇది భావోద్వేగభరిత అంశం. ఏపీ ప్రజలకు సేవ చేసేందుకు మీరు నవ్యోత్సాహంతో మంత్రిగా ప్రస్థానం ప్రారంభిస్తున్న సమయంలో మీకు నా శుభాకాంక్షలు" అంటూ నారా బ్రాహ్మణి ట్వీట్ చేశారు.

అటు, నారా భువనేశ్వరి కూడా సోషల్ మీడియాలో స్పందించారు. "మంగళగిరి ప్రజల ఆశీర్వాదంతో చారిత్రాత్మక గెలుపును సొంతం చేసుకుని, మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నారా లోకేశ్ కు శుభాకాంక్షలు. ఒక తల్లిగా ఇది నాకు మర్చిపోలేని రోజు. ముమ్ముందు మరిన్ని విజయాలు అందుకుని ఇటు చరిత్రలోనూ, అటు ప్రజల హృదయాల్లోనూ కలకాలం నిలిచిపోవాలని దీవిస్తున్నాను" అంటూ నారా భువనేశ్వరి పేర్కొన్నారు.



చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా రాష్ట్ర మంత్రివర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యేందుకు ప్రత్యేక విమానంలో వచ్చిన దేశ ప్రధాని నరేంద్ర మోదీకి గన్నవరం విమానాశ్రయంలో తెలుగుదేశం పార్టీ రాజకీయ కార్యదర్శి టీడీ జనార్ధన్ సాదర స్వాగతం పలికారు. మోదీకి శాలువ కప్పి, బొకే అందించి సత్కరించారు. అంతకుముందు జనార్ధన్‌ను ప్రధానికి చంద్రబాబు పరిచయం చేశారు.

చైతన్యరథం



## చంద్రబాబు కుటుంబ సభ్యులతో
# ప్రధాని మోదీ గ్రూప్ ఫొటో

గన్నవరం: ఏపీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణం స్వీకార కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా విచ్చేసిన సంగతి తెలిసిందే. ఈ ఉదయం 11.27 గంటలకు చంద్రబాబు ఏపీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ప్రధాని మోదీ అమితానందం వ్యక్తం చేశారు. కాగా, ఈ కార్యక్రమానికి విచ్చేసిన సందర్భంగా ప్రధాని మోదీ... సీఎం చంద్రబాబు కుటుంబ సభ్యులతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు. ఈ ఫొటోలో మోదీతో పాటు చంద్రబాబు, నారా భువనేశ్వరి, నారా లోకేష్, బ్రాహ్మణి, నారా దేవాన్ష్ ఉన్నారు.

మోదీ... లోకేశ్ తనయుడు దేవాన్ష్ భుజాలపై చేతులేసి చిరునవ్వులు చిందిస్తూ నిల్చుని ఉండడం ఈ ఫొటోలో చూడొచ్చు. విజయోత్సాహం ఎలా ఉంటుందో ఈ ఫొటోలో మోదీ, చంద్రబాబు తదితరుల ముఖాలు వెలిగిపోతున్న తీరు చెప్పకనే చెబుతుంది.

## రేణిగుంట విమానాశ్రయంలో
# చంద్రబాబుకు ఘనస్వాగతం





తిరుపతి: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణం స్వీకారం అనంతరం మొదటి సారిగా తిరుపతి జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా రేణిగుంట విమానాశ్రయానికి బుధవారం రాత్రి 7.35 గం.లకు కుటుంబ సమేతంగా చేరుకోగా, ఘన స్వాగతం లభించింది. ముఖ్యమంత్రి వెంట మంత్రి నారా లోకేష్ ఉన్నారు. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కరికాల వలనన్, డిఐజీ షిమోషి, తిరుపతి, చిత్తూరు జిల్లాల కలెక్టర్లు ప్రవీణ్ కుమార్, షన్మోహన్, తిరుపతి ఎస్పీ హర్ష వర్ధన్ రాజు, ఎమ్మెల్యే లు బొజ్జల సుధీర్ రెడ్డి, పులివర్తి నాని, చిత్తూరు జేసీ శ్రీనివాసులు, టీటీడీ జే ఈ ఓ గౌతమి, తిరుపతి మునిసిపల్ కమిషనర్ అదితి సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్ తదితరులు ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి రాత్రి 7.55 గంటలకు రేణిగుంట విమానాశ్రయం నుండి రోడ్డు మార్గాన తిరుమలకు శ్రీవారి దర్శనార్థం బయల్దేరి వెళ్లారు. గురువారం ఉదయం 7.30 గం.లకు తిరుమల శ్రీవారిని కుటుంబసమేతంగా దర్శించుకోనున్నారు.

## రాష్ట్రంలో ఇక అభివృద్ధి పరుగులు

*- విజయనగరం ఎంపీ అప్పలనాయుడు*



ఉండవల్లి: ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడి నేతృత్వంలో రాష్ట్రంలో ఇక అభివృద్ధి పరుగులు పెడుతుందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. బుధవారం ఉండవల్లిలోని చంద్రబాబు నివాసం వద్ద అప్పలనాయుడు మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు ప్రమాణ స్వీకారంతో ప్రజా ప్రభుత్వానికి శ్రీకారం చట్టారన్నారు. 5కోట్ల ఆంధ్రుల కల నెరవేరిందన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడింది, ఆంధ్ర రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతుంది. ఆంధ్రుల కలల రాజధాని అమరావతి అజరామరంగా అభివృద్ధి చెందడం ఖాయం. ఆంధ్రుల జీవనాడి పోలవరాన్ని పూర్తి చేస్తాం. పార్లమెంట్ సెంట్రల్ హాల్ లో ఎన్డీఏ కూటమి ఎంపీల సమావేశానికి హాజరైన చంద్రబాబు నాయుడుకి లభించిన గౌరవం ప్రత్యక్షంగా చూసి సగటు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యుడిగా చాలా గర్వపడ్డాను. ఆ గౌరవం యావత్ తెలుగు ప్రజలకు దక్కిన గౌరవం. యువగళం పాదయాత్రతో నారా లోకేష్ రాష్ట్ర ప్రజల సమస్యలను, వారి కష్టాలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఆయన మంత్రివర్గంలో ఉండటం వలన ప్రజల సమస్యలను తీర్చే అవకాశం ఉంటుంది. మంత్రివర్గంలో అన్ని వర్గాలకు సామాజిక న్యాయం జరిగింది. గతంలో లాగే మంత్రివర్గంలో సీనియర్లకు, యువతకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. కూటమి ప్రభుత్వం కేంద్రంలో, రాష్ట్రంలో అభివృద్ధికి అధిక ప్రాధాన్యతను ఇస్తుంది. ప్రజా ప్రభుత్వ ఏర్పాటుకు కారకులైన ప్రతి ఒక్కరికి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నామన్నారు.

### ముందు కార్యకర్త.. తర్వాతే ఎంపీ

గన్నవరంలో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకార చేసిన సందర్భంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు సాధారణ కార్యకర్త మాదిరిగా ఆనందంతో కేరింతలు వేశారు. నారా చంద్రబాబు నాయుడు అను నేను.. మాటలు వినగానే

# కువైట్‌లో భారీ అగ్ని ప్రమాదం

**50 మంది మృతి**

**మృతుల్లో 40 మంది భారతీయులు**

**ప్రధాని మోదీ ఉన్నత స్థాయి సమీక్ష**

కువైట్: అరబ్ దేశం కువైట్‌లో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఓ భవనంలో మంటలు చెలరేగి 50 మంది మృతిచెందారు. వీరిలో 40 మంది భారతీయులే కావడం మరింత విషాదకరం. జీవనోపాధి కోసం సొంతవాళ్లకు దూరంగా వచ్చి ఓ కంపెనీలో పనిచేస్తున్న వీరంతా ఇలా దురదృష్టవశాత్తూ ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో 25 మంది కేరళ వాసులేనని తెలుస్తోంది. దక్షిణ మంగాఫ్ నగరంలోని ఓ ఆరు అంతస్తుల భవనంలో బుధవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. ప్రమాద సమయంలో భవనంలో 160 మంది ఉన్నారు. వీరంతా ఒకే కంపెనీలో పనిచేస్తున్నట్లు తెలిపింది. తొలుత కిచెన్‌లో ప్రారంభమైన మంటలు క్షణాల్లోనే భవనమంతా వ్యాపించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనలో 41 మంది మంటల్లో కాలి సజీవదహనమవ్వగా... మరో ఆరుగురు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో 40 మంది భారతీయులేనని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ ప్రమాదంలో మరో 50 మందికి పైగా గాయపడ్డారు. వీరిలో 30 మంది భారతీయులే. ఘటన జరిగిన భవనం కువైట్‌లోని అతిపెద్ద నిర్మాణ సంస్థకు చెందినదిగా తెలిసింది. ప్రమాదం జరిగిన సమయంలో భవనంలోని చాలా మంది నిద్రలో ఉన్నారు. దీంతో ప్రాణనష్టం ఎక్కువగా ఉన్నట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. కువైట్ అగ్ని ప్రమాద ఘటనపై భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 50 మందికి పైగా మరణించారని, మరో 50 మందికి పైగా బాధితులు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చేరినట్లు తెలిసిందన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. విషయం తెలిసిన వెంటనే కువైట్‌లోని భారతీయ రాయబారి ఘటనా స్థలాన్ని సందర్శించారని... బాధితులకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ప్రమాదంపై కువైట్ అధికారుల నుంచి మరింత సమాచారం కోసం ఎదురుచూస్తున్నట్లు వెల్లడించారు.

### ప్రధాని మోదీ దిగ్భ్రాంతి...

ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పరిస్థితులను కువైట్‌లోని భారత రాయబార కార్యాలయం సమీక్షిస్తోందని... మనవారికి అన్నివిధాలా సహాయం అందించేందుకు కృషి చేస్తోందన్నారు. ఈ నేపథ్యంలో ప్రధాని నివాసంలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు.

### కువైట్‌కు కేంద్రమంత్రి...

అగ్నిప్రమాదంలో గాయపడిన వారికి అందుతోన్న సహాయాన్ని పర్యవేక్షించేందుకు గాను భారత విదేశాంగశాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ కువైట్‌కు వెళ్లనున్నారు. ప్రధాని మోదీతో భేటీ ముగిసిన వెంటనే తాను బయల్దేరనున్నట్లు ఆయన వెల్లడించారు. వీలైనంత తొందరగా మృతదేహాలను భారత్‌కు రప్పించేందుకు స్థానిక అధికారులతో సమన్వయం చేయనున్నారు. ప్రధాని మోదీ ఆదేశాల మేరకు కేంద్రమంత్రిని గల్ఫ్‌కు పంపిస్తున్నట్లు విదేశాంగ శాఖ కార్యాలయం సైతం ఓ ప్రకటనలో తెలిపింది.

### బాధితుల్లో కేరళవాసులే అధికం

కువైట్ భవనం వద్ద జరిగిన అగ్నిప్రమాద ఘటనలో మరణించిన వారిలో ఎక్కువగా కేరళ, తమిళనాడుకు చెందినవారే ఉన్నట్లు సమాచారం. ఈ విషయంలో కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరుతూ విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌కి కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ లేఖ రాశారు. బాధితుల్లో ఎక్కువగా మలయాళీలు ఉన్నారని... వారికి తక్షణ సహాయం అందించాలని కోరారు.



చైతన్యరథం





# ప్రమాణ స్వీకారోత్సవ దృశ్యాలు


















# కేసరపల్లిలో ప్రమాణ స్వీకారోత్సవ సందడి





















# సామాజిక సమతూకం, యువతరానికి పెద్దపీటగా మంత్రివర్గం

**- మంత్రివర్గ కూర్పుపై హర్షం వ్యక్తం చేసిన జీవీ ఆంజనేయులు**



**వినుకొండ (చైతన్యరథం):** అన్ని వర్గాలకు న్యాయం చేస్తూ సామాజిక సమతూకం పాటిస్తూ, యువతరానికి పెద్దపీట వేసిన రాష్ట్రమంత్రివర్గ కూర్పు అద్భుతంగా కుదిరిందని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు వ్యాఖ్యానించారు. కూటమి మంత్రివర్గంలో ఏకంగా 17 మంది కొత్తవారికి అవకాశం కల్పించడాన్ని సాహసోపేతమైన నిర్ణయంగా, ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టికి నిదర్శనంగా అభివర్ణించారాయన. నవ్యాంధ్ర ప్రదేశ్ మూడవ ముఖ్యమంత్రిగా చంద్రబాబు, క్యాబినెట్ మంత్రుల ప్రమాణస్వీకారం సందర్భంగా బుధవారం ఈ మేరకు ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు జీవీ. అన్నిప్రాంతాలు, అన్ని జిల్లాలు, అన్నివర్గాలకు ప్రాధాన్యం లభించేలా మంత్రుల ఎంపికలో చంద్రబాబు జాగ్రత్తలు తీసుకున్నారని కితాబిచ్చారు. ముగ్గురు మహిళలకు కూడా చోటు కల్పిస్తూ, సీనియర్ల, యువత, విద్యావంతులు, అనుభవజ్ఞుల మధ్య సమతూకం పాటిస్తూ మంత్రివర్గాన్ని రూపొందించారన్నారు జీవీ. తొలిసారే గెలిచిన వాళ్లలో 10మందిని మంత్రులుగా ఎంచుకోవడం ద్వారా కూడా కొత్తతరానికి మెరుగైన ప్రాతినిధ్యం కల్పించినట్లైందన్నారు. మంత్రివర్గ స్వరూపాన్ని చూస్తే నలుగురు కాపులు, నలుగురు కమ్మ, ముగ్గురు రెడ్లకు అవకాశం ఇచ్చారని, అదే సమయంలో 8మంది బీసీలు, ఎస్సీలు ఇద్దరు, ఎస్టీ, ముస్లిం మైనారిటీ, వైశ్యుల నుంచి ఒక్కొక్కరికి అవకాశం ఇవ్వడం ద్వారా అందరి ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేలా చూశారన్నారు. సంక్లిష్ట సమయంలో రాష్ట్ర పునర్నిర్మాణ సవాళ్ల ను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంచుకున్న ఈ జట్టు... రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రపథాన నిలుపుతుందనీ జీవీ ఆంజనేయులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుని బైక్‌పై ప్రమాణస్వీకారానికి ప్రత్తిపాటి



**చిలకలూరిపేట (చైతన్యరథం):** చంద్రబాబు ప్రమాణస్వీకార మహోత్సవం సందర్భంగా భారీస్థాయిలో పోటెత్తిన అభిమాన సంద్రంతో గన్నవరం హైవే పరిసరాలు స్తంభించడంతో ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుపోయిన మాజీమంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు వేదికను చేరుకోవడానికి సాహస యాత్రనే చేశారు. జాతీయ రహదారిపై పూర్తిగా వాహనాలతో కిక్కిరిసి పోవడంతో తన వాహనం వదిలి పెట్టి స్థానిక కార్యకర్తల సహాయంతో బైక్‌పై సభా ప్రాంగణానికి చేరుకున్నారు. వివరాల్లోకి వెళితే... బుధవారం కృష్ణా జిల్లా గన్నవరం మండలం కేసరపల్లి ఐటీ పార్కు సమీపంలో చంద్రబాబు ప్రమాణస్వీకార కార్యక్రమానికి మూడు పార్టీల శ్రేణులు లక్షలాదిగా పోటెత్తారు. భారీ సంఖ్యలో వాహనాల్లో తరలివచ్చారు. దీంతో జాతీయ రహదారిపై విపరీతమైన రద్దీ ఏర్పడింది. భారీ వాహనాలు ముందుకు కదిల్లేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా ముందుగానే ప్రమాణస్వీకార కార్యక్రమానికి బయలుదేరినా మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. ఎంత ప్రయత్నించినా ప్రమాణస్వీకార సభకు చేరుకోలేని పరిస్థితి ఏర్పడింది. వేదిక వద్దకు సుమారు 10 కిలోమీటర్ల దూరంలో ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. ఎటు కదల్లేని ఆ పరిస్థితుల్లో కారులో నుంచి దిగి కార్యకర్తకు చెందిన ద్విచక్రవాహనంపై సభా ప్రాంగణం వద్దకు చేరుకున్నారు. అప్పటికే ముఖ్యమంత్రి, మంత్రుల ప్రమాణస్వీకార ఘట్టం ముగియడంతో అందరికీ శుభాకాంక్షలు తెలిపి వెనుదిరిగారు. అయితే ఇదే సమయంలో ట్రాఫిక్ రద్దీ, అభిమాన సందోహం మధ్య ప్రత్తిపాటి పుల్లారావు బైక్ ప్రయాణం దృశ్యాలు వైరల్‌గా మారి అందర్నీ ఆకట్టుకున్నాయి.

## బాబు ప్రమాణస్వీకారంతో ప్రజలకు మరోసారి స్వాతంత్రం వచ్చినట్లైంది

**- టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు**



**నెల్లూరు (చైతన్యరథం):** ఐదేళ్ల అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడారని, ప్రజాస్వామ్యంలో నియంతృత్వానికి, అణచివేత, కక్ష సాధింపు చర్యలకు తావులేదని మరోసారి రుజువైందని టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో నిన్నటి నుంచి ప్రజాపరిపాలన మొదలైందని, నవశకానికి నాంది పలికిన టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, మంత్రులుగా ప్రమాణం చేసి వారికి ధర్మవరం సుబ్బారావు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరు నగరంలోని నర్తకి సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ శ్రేణులతో కలిసి సుబ్బారావు పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రానికి మరోసారి స్వాతంత్రం వచ్చినట్లు ప్రజలు భావిస్తున్నారని, ఇన్నాళ్లు ఆగిపోయిన రాష్ట్రాభివృద్ధి ఇకనుంచి వేగం పుంజుకుంటుంద"న్నారు. ఒక్కఛాన్స్ ఇవ్వాలని అధికారంలోకి వచ్చిన జగన్... అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని మండిపడ్డారు. ప్రజలను అన్నింటా మోసం చేసి ఐదేళ్ల పాటు పాలన చేట్టారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించ డంలో వైసీపీ సర్కారు పూర్తిగా విఫలమైంది. కేవలం బటన్ నొక్కడం తప్ప మరేమీ చేయలేదని, ఈ ఎన్నికల్లో ప్రజలు వాస్తవాలు గ్రహించి ప్రజాపరిపాలన కోసం ఎన్డీయే కూటమికి పట్టం కట్టారని అన్నారు. నెల్లూరు జిల్లా నుంచి ఇద్దరికి మంత్రి పదవులు లభిం చడం ఆనందంగా ఉందని, రాష్ట్రాభివృద్ధితో పాటు నెల్లూరు నగరాన్ని సైతం అద్భుతంగా తీర్చిద్దిడం ఖాయమని సుబ్బారావు వ్యాఖ్యా నించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గణేష్ కుమార్, కల్వకుంట భాస్కర్, రెహమాన్, కోటపాటి రాజ, అద్దంకి చంద్ర, సిద్ధకళాచారి, రత్నం, కల్వకుంట సుధా, మునిశేఖర్ , ఆర్కాట్ శ్రీనివాసులు, పెంచలయ్య ,వీరమల్లు చంద్ర, మోపురు కృష్ణయ్య, రాధాకృష్ణ , సాయిరాం , సారిక, ప్రవళిక , పద్మజ , హరి, పివి రత్నం , మురళి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





ఎన్నికల్లో తెలుగుదేశం కూటమి అఖండ విజయం సాధించడంతో విదేశాల్లో పార్టీ మద్దతుదారులు సంబరాలు జరుపుకున్నారు. పారిస్ నగరంలోని ఈఫిల్ టవర్ వద్ద టీడీపీ అభిమానులు పసుపు జెండాలతో బాయ్ బాయ్ జగన్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి రావడంతో రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయని వారు హర్షం వ్యక్తం చేశారు.

## కేంద్రమంత్రులు, మహారాష్ట్ర సీఎంకు స్వాగతం పలికిన ఎంపి శివనాథ్

**- నితిన్ గడ్కరీ, చిరాగ్ పాశ్వాన్, సీఎం ఏకనాథ్ షిండే రాక**

**- గన్నవరం విమానాశ్రయంలో కేశినేని శివనాథ్ సందడి**



**గన్నవరం (చైతన్యరథం):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారోత్సవానికి విచ్చేసిన కేంద్రమంత్రులు, మహారాష్ట్ర సీఎం, ఎంపీలకు విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) బుధవారం గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం పలకారు. ఉదయం ఏడు గంటల నుంచి గన్నవరం ఎయిర్ పోర్ట్‌లోనే వేచి వుండి ముంబై, ఢిల్లీల నుంచి ప్రత్యేక విమానాల్లో వచ్చిన కేంద్రమంత్రి చిరాగ్ కుమార్ పాశ్వాన్, రాజ్యసభ ఎంపీ ప్రఫుల్ పటేల్, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండేలకు పూలబోకే అందించి స్వాగతం చెప్పారు.

అనంతరం వారిని ఎయిర్ పోర్ట్ వెలుపల వెహికల్స్ ఎక్కించి సభాస్థలికి పంపించారు. ముందుగా కేంద్రమంత్రి చిరాగ్ కుమార్ పాశ్వాన్ రాగా, ఆ తర్వాత రాజ్యసభ ఎంపి ప్రఫుల్ పటేల్, అనంతరం నితిన్ గడ్కరీ, ఏక్‌నాథ్ షిండేలు రావటం జరిగింది. వీరందరికి కేశినేని శివనాథ్‌తో పాటు అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాథూర్ కూడా స్వాగతం చెప్పారు. అతిథులకు స్వాగతం పలికే సమయంలో కేశినేని శివనాథ్ చాలా ఉత్సాహంగా ఎయిర్‌పోర్ట్‌లో అటు ఇటు తిరుగుతూ సందడిగా కనిపించారు.

## దార్శనికుని పాలనలో ఆంధ్రప్రదేశ్ పరుగులు

**- గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి**



**గుంటూరు (చైతన్యరథం):** ముఖ్యమంత్రిగా 4వసారి ప్రమాణస్వీకారం చేసిన నారా చంద్రబాబునాయుడు రికార్డును ఎవరు చెరపలేరని, ఇటువంటి దార్శనికుని పాలనలో నవ్యంధ్రప్రదేశ్ పరుగులు పెట్టడం ఖాయమని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి వ్యాఖ్యానించారు. బుధవారం నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారాన్ని పురస్కరించుకొని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో భారీ ఎల్.ఈ.డిలు ఏర్పాటు చేశారు. నియోజకవర్గ ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి, ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం పార్టీ నేతలు, ప్రజలకు గళ్ళా మాధవి భారీ విందుభోజనం ఏర్పాటు చేశారు.

## రాష్ట్రానికి మంచిరోజులు వచ్చాయి

**- చంద్రబాబు ప్రమాణస్వీకారం సందర్భంగా సంబరాలు నిర్వహించిన పార్టీ శ్రేణులు**



**విజయవాడ (చైతన్యరథం):** ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ అధినేత నాలుగోవసారి ప్రమాణస్వీకారం చేస్తున్న సందర్భంగా విజయవాడలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్‌కట్ చేసి సంబరాలు నిర్వహించారు. నేటినుంచి రాష్ట్రానికి మంచిరోజులు వచ్చాయని, గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందన్నారు. గర్వంతో తలపోగరెక్కి విర్రవీగిన ప్రతిఒక్కడికి రాబోయే రోజుల్లో సరైన బుద్ధి చెబుతామని మాజీ కార్పొరేటర్ యేదుపాటి రామయ్య వ్యాఖ్యానించారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే ఆగిన అమరావతి పనులు ఊపుందుకున్నాయని, అమరావతి రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారని అన్నారు. జగన్ తన పాలన జేసీబీలతో మొదలుపెట్టి విధ్వంసం సృష్టిస్తే... చంద్రబాబు అదే జేసీబీలో అభివృద్ధికి బాటలు వేస్తున్నారని అన్నారు. జగన్ లాంటి చెత్త పాలన చూసి ప్రజలు విసిగిపోయారని, టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ప్రజలు గ్రహించి మొన్నటి ఎన్నికల్లో కూటమికి అధిక మెజారిటీ కట్టబెట్టారని అన్నారు. ఇకపై రాష్ట్ర ప్రజలు సరికొత్త పాలన చూడబోతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ భాను, అఖిల్ చౌదరీ, పచ్చ మల్లికార్జున, చరణ్, ఉమ, నాయుడు, తెలుగుదేశం, బీజేపీ, జనసేన కూటమి కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఏలూరి హ్యాట్రిక్ గెలుపు



## - మొక్కులు చెల్లించుకున్న పార్టీ అభిమానులు

**పర్చూరు (చైతన్యరథం):** కూటమి విజయం, చంద్రబాబు సీఎంగా, ఎమ్మెల్యేగా ఏలూరి సాంబశివరావు హ్యాట్రిక్ గెలుపుతో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. బుధవారం పోతినవారిపాలెం నుంచి గ్రామ ప్రజలు ఇంకొల్లు మండలంలోని పావులూరు పొలిమేర ఆంజనేయస్వామి గుడివరకు పాదయాత్ర నిర్వహించారు. పోతినవారిపాలెం నుంచి కొనసాగిన ఈ పాదయాత్రకు దగ్గుబాడు, నాయుడువారిపాలెం టీడీపీ నాయకులు మద్దతు తెలిపి పాదయాత్రలో పాల్గొన్నారు. ఇంకొల్లులో పర్చూరు రోడ్డులోని వైజంక్షన్ నుంచి స్థూపం సెంటర్, జండాచెట్టు మీదగా పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాగులచెరువుకట్ట వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ పాదయాత్రకు మండలంలోని టీడీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొని స్వాగతం పలికారు. ఈ పాద యాత్రలో పోతినవారిపాలెం, నాయుడు వారిపాలెం గ్రామాల రైతులు, మహిళలు, యువత ఉత్సాహంగా పాల్గొని జై చంద్రబాబు, జై ఏలూరి అంటూ నినాదాలు చేశారు. సుమారు 30కి పైగా ట్రాక్టర్లతో రైతులు పాల్గొనగా, పెద్ద సంఖ్యలో అభిమానులు పాదయాత్రలో పాల్గొన్నారు. పోతివారిపాలెం సర్పంచ్ పోతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించగా, ఆ గ్రామాల నాయకులు పోతిన వెంకట్రావు, మస్తాన్‌రావు, పేర్ని నవీన్, వెంకటేశ్వర్లు, వెంపరాల నాగేశ్వరరావు, ధర్మ, సురేంద్ర, పొన్నం వెంకట్రావు, చుండి రాము, బాపనయ్య, బలరాం, నాయుడు సుబ్బారావు, మురకొండ శ్రీను, శ్రీను, గోరంట్ల రమాదేవి పాల్గొన్నారు.

# అంబరాన్నంటిన తెలుగు తమ్ముళ్ల సంబరాలు

- భారీ బాణాసంచా నడుమ వేగుళ్ళ కు ఘన స్వాగతం
- తండ్రికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే వేగుళ్ళ



**మండపేట (చైతన్యరథం):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకార కార్యక్రమానికి హాజరై మండపేట కు తిరిగి విచ్చేసిన ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు కు మండపేటలో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అలమూరు నుండి భారీ ర్యాలీతో మండపేట చేరుకున్న వేగుళ్ళ తొలుత కలువపువ్వు సెంటర్లోని తన తండ్రి వేగుళ్ళ వీర్రాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కలువపువ్వు సెంటర్ నుండి పాదయాత్రగా రథం సెంటర్ లోని పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా అభిమానులు పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి వేడుకలు జరుపుకున్నారు. అనంతరం అందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా రాష్ట్ర మంత్రివర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రత్యేక విమానంలో హాజరైన దేశ ప్రధాని నరేంద్ర మోడీకి గన్నవరం విమానాశ్రయంలో తెలుగుదేశం పార్టీ రాజకీయ కార్యదర్శి టీడీ. జనార్ధన్ సాదర స్వాగతం పలికారు. ప్రధానికి శాలువ కప్పి, బొకే అందించి సత్కరించారు.



మంత్రివర్గంలో నూతన మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన పెనుకొండ శాసనసభ్యురాలు ఎస్.సవితని శాలువాతో సత్కరించి, స్వీట్స్ తినిపించి అభినందనలు తెలియజేసిన రాప్తాడు శాసనసభ్యురాలు పరిటాల సునీతమ్మ, ధర్మవరం టీడీపీ ఇన్‌ఛార్జ్ పరిటాల శ్రీరామ్, అనంతపురం అర్బన్ శాసనసభ్యులు దగ్గుపాటి ప్రసాద్ తదితరులు.

# యూఎస్ కౌన్సిల్ జనరల్ జెన్నీఫర్ లార్సన్ కు శుభాకాంక్షలు తెలిపిన “ఆళ్ళ”

## - చంద్రబాబు ప్రమాణస్వీకారంలో ప్రత్యేక అతిథిగా పాల్గొన్న జెన్నీఫర్ లార్సన్

**విజయవాడ (చైతన్యరథం):** కృష్ణాజిల్లా గన్నవరం మండలం ఐటీ పార్క్ వద్ద బుధవారం ప్రమాణస్వీకార కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా పాల్గొన్న హైదరాబాద్ యూఎస్. ఎంబసీకి సంబంధించిన యూఎస్ కాన్సులేట్ జనరల్ జెన్నీఫర్ లార్సన్‌ను టీడీపీనేత, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు ప్రత్యేకంగా కలిసి ఈ ప్రమాణ స్వీకారం లో పాల్గొన్నందుకు ఆంధ్రప్రదేశ్ ప్రజల తరఫున శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జెనిఫర్ లర్సన్ తో ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు మాట్లాడుతూ ... చంద్రబాబు ప్రపంచం గుర్తించిన ఒక విజనరీ అనీ ఆయన నాయకత్వంలో రాబోయే ఐదు సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందుతుంది అని తాము భావిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి



చిరుమామిళ్ళ సూర్యనారాయణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాణస్వీకారం వేళ పత్తికొండలో తెలుగుయువత ర్యాలీ

**పత్తికొండ (చైతన్యరథం):** ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు, ఇతర మంత్రుల ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా పత్తికొండలో తెలుగు యువత ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. పత్తికొండ మార్కెట్ యార్డ్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం పట్టణవీధుల గుండా అంబేద్కర్ కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాలుగు స్తంభాల కూడలి వద్ద ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేసి, కేకు కోసి, మిఠాయిలు పంచిపెట్టారు. బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అమరావతి విశ్వనగరంగా విరాజిల్లుతుంది

## - రాజధాని శంకుస్థాపన వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన శివస్వామి

**తుళ్లూరు (చైతన్యరథం):** అమరావతి విశ్వనగరంగా విరాజిల్లుతుందని తాళ్ళాయపాలెం శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం రాజధాని అమరావతికి శంకుస్థాపన జరిగిన ప్రాంతంలో పూజలు నిర్వహించారు. రైతులు ఈ సందర్భంగా 'జై అమరావతి.. ఆంధ్రుడు మేలుకొన్నాడు.. అమరావతి నిలిచింది.. స్వర్ణాంధ్ర కలను సాకారం చేద్దాం' అని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శివస్వామి మాట్లాడుతూ అమరావతిని నాశనం చేయాలని చూసిన వైసీపీ అధినేత జగన్ కు రాష్ట్ర ప్రజలు సరైన బుద్ధి చెప్పారన్నారు. అమరావతి రూపకర్త చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా అమరావతి వేగంగా అభివృద్ధి చెందాలని ఆశీర్వదించారు. అమరావతికి ఏర్పడిన అవరోధాలు తొలగిపోయి నవ నిర్మాణాలతో రాష్ట్రం స్వర్ణాంధ్రగా మారాలని సంకల్పించారు. టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు మాధవ నాయుడు, రామకృష్ణ, రైతులు, రైతుకూలీలు, మహిళలు పాల్గొన్నారు.



# ఒడిశా సీఎంగా మోహన్ చరణ్ మాఝీ ప్రమాణస్వీకారం

## హాజరైన అతిరథమహారథులు

**భువనేశ్వర్:** ఒడిశా తొలి బీజేపీ ముఖ్యమంత్రిగా మోహన్ చరణ్ మాఝీ బుధవారం సాయంత్రం 5 గంటలకు ప్రమాణ స్వీకారం చేశారు. ఉప ముఖ్యమంత్రులుగా కనక వర్దన్ సింహ్ దేవ్, ప్రవటి పరిదా ప్రమాణ స్వీకారం చేశారు. వీరిచేత ఒడిశా గవర్నర్ రఘుబీర్ దాస్ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వయంగా హాజరయ్యారు. భువనేశ్వర్‌లోని జనతా మైదాన్‌లో అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు కేంద్ర మంత్రులు, బీజేపీ పాలిత రాష్ట్ర ముఖ్యమంత్రులు సహా 30,000 మంది ప్రజానీకం పాల్గొన్నారు. మాఝీ ఆహ్వానం మేరకు బిజూ జనతాదళ్ చీఫ్ నవీన్ పట్నాయక్ సైతం హాజరయ్యారు.

మోహన్ చరణ్ మాఝీ ప్రమాణస్వీకారానికి హేమాహేమీలు హాజరయ్యారు. కేంద్ర మంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్, అశ్విని వైష్ణవ్, నితిన్ గడ్కరి, జేపీ నడ్డా, అసోం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ, హర్యానా సీఎం నయబ్ సింగ్ సైని, ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి, గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్, ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణు దేవ్ సాయి, త్రిపుర సీఎం మానిక్ సహా, మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్, ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ తదితరులు హాజరయ్యారు. ఇటీవల జరిగిన ఒడిశా అసెంబ్లీ ఎన్నికల్లో 147 స్థానాలకు గాను 78 సీట్లు బీజేపీ గెలుచుకోవడంతో 24 ఏళ్ల బీజేడీ పాలనకు తెరపడింది.



## పోక్సో కేసులో యెడియూరప్పకు సీఐడీ నోటీసులు

**బెంగళూరు :** కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నాయకులు యెడియూరప్పకు పోక్సో కేసులో ఇవాళ విచారణకు హాజరు కావాలని సీఐడీ నోటీసులు జారీ చేసింది. యెడియూరప్ప ప్రస్తుతం ఢిల్లీలో ఉన్నారని, బెంగళూరు రాగానే సీఐడీ ముందు విచారణకు హాజరవుతారని ఆయన సన్నిహిత వర్గాలు పేర్కొన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఓ 17 ఏండ్ల బాలిక పట్ల యెడియూరప్ప అసభ్యంగా ప్రవర్తించి, లైంగిక వేధింపులకు గురి చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. బాధిత బాలిక తల్లి మార్చి 14వ తేదీన సదాశివనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఈ కేసును సీఐడీకి అప్పగిస్తూ కర్ణాటక డీజీపీ అలోక్ మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో యెడియూరప్పకు నోటీసులు జారీ అయ్యాయి. తాను ఎవర్నీ కూడా లైంగికంగా వేధించలేదని, ఈ కేసు విషయంలో న్యాయపోరాటం చేస్తానని యెడియూరప్ప గతంలో ప్రకటించారు. ఇక ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో బాధపడుతున్న బాధితురాలి తల్లి ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గత నెలలో చనిపోయారు. ఈ కేసులో బాధితురాలితో పాటు ఆమె తల్లి వాంగ్మూలాన్ని సీఐడీ అధికారులు నమోదు చేశారు.



## వారణాసిలో ప్రధాని మోదీ ఓటమి నుంచి తప్పించుకున్నారు : రాహుల్ గాంధీ

**తిరువనంతపురం :** ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీ పోటీ చేసిన వారణాసిలో ఆయన ఓటమి నుంచి తప్పించుకున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. కేరళలోని మలప్పురంలో ఓ సమావేశంలో రాహుల్ గాంధీ పాల్గొని ప్రసంగించారు. అయోధ్య ప్రజల చేతిలో భాజపా ఓడినట్లే వారణాసిలో మోదీ ఓడిపోయి ఉండేవారని వ్యాఖ్యానించారు. ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడానికి కావాల్సిన సీట్లు భాజపా ఒంటరిగా సాధించకపోవడానికి మోదీ నైతిక బాధ్యత వహించాలని రాహుల్ డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు రాజ్యాంగాన్ని మారుస్తామని భాజపా నేతలు మాట్లాడారని, కానీ అదే రాజ్యాంగానికి ప్రమాణస్వీకారం వేళ మోదీ దండం పెట్టుకున్నారని వ్యాఖ్యానించారు. దేశ ప్రజలు వారికి ఏం కావాలో ప్రధానికి స్పష్టంగా తెలిసేలా చేశారన్నారు. మోదీ వారణాసిలో కాంగ్రెస్ అభ్యర్థి అజయ్ రాయ్ పై 150,000 ఓట్లకు పైగా మెజార్టీతో విజయం సాధించారు.



అయోధ్యలో సమాజ్ వాదీ పార్టీకి చెందిన అవదేశ్ ప్రసాద్ భాజపాఅభ్యర్థి లల్లూ సింగ్‌పై విజయం సాధించారు. భాజపా కంచుకోట అయిన ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ ఆరు స్థానాలతో సహా మొత్తం 99 స్థానాలను ఇండియా గెలుచుకుంది. లోక్‌సభ ఎన్నికల్లో భాజపా 240 సీట్లలో విజయం సాధించినా, ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడానికి మరో 32 సీట్లు కావాల్సి రావడంతో చంద్రబాబునాయుడు(టీడీపీ), నీతీశ్‌కుమార్ (జేడీయూ) సహాయం తీసుకొని ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది.

## రియాసీ ఉగ్రదాడి అనుమానితుడి ఊహా చిత్రం విడుదల

**శ్రీనగర్:** జమ్మూకశ్మీర్‌లో రియాసీ వద్ద యాత్రికుల బస్సుపై జరిగిన ఉగ్రదాడి ఘటన దర్యాప్తులో కీలక పరిణామాలు చోటుచేసుకొన్నాయి. ప్రధాన నిందితుడి ఊహా చిత్రాలను పోలీసులు విడుదల చేశారు. నిందితుడి ఆచూకీ వెల్లడిస్తే రూ.20 లక్షలు బహుమతిగా ఇస్తామని ప్రకటించారు. ఈ ఘటనకు ప్రత్యక్ష సాక్షులను పోలీసులు విచారించారు. వారు అందజేసిన వివరాల ఆధారంగా ఓ స్కెచ్‌ను తయారుచేయించారు. "రియాసీ వద్ద బస్సుపై జరిగిన ఉగ్ర దాడిలో నిందితుడి సమాచారం అందిస్తే... వారికి రూ.20 లక్షల బహుమతి అందిస్తాం" అని పోలీసుశాఖ ప్రతినిధి పీటీఐకు వెల్లడించారు. గత ఆదివారం శివ్‌ఖోరీ ఆలయం నుంచి మాతా వైష్ణవిదేవి గుడికి బయల్దేరిన బస్సుపై ఉగ్రవాదులు దాడి చేశారు. ఈ వాహనంలో ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, ఢిల్లీకి చెందిన యాత్రికులు ఉన్నారు. దీనిపై ఉగ్రమూక కాల్పులు జరుపడంతో తొమ్మిది మంది భక్తులు గాయపడ్డారు. ఈ దాడి తర్వాత దోడా, కథువా జిల్లాల్లో వరుసగా ఉగ్ర ఘటనలు చోటు చేసుకొన్నాయి. నేటి ఉదయం కథువాలో జరుగుతున్న జాయింట్ ఆపరేషన్‌లో ఇద్దరు ఉగ్రవాదులను మట్టుబెట్టారు. ఈ దాడుల్లో పాల్గొన్న వారు సుదీర్ఘకాలంగా జమ్మూకాశ్మీర్‌లోనే ఉంటున్నట్లు పోలీసువర్గాలు గుర్తించాయి. తాజాగా మృతి చెందిన ఉగ్రవాది బ్యాగ్ నుంచి రూ.లక్ష నగదును అధికారులు స్వాధీనం చేసు కొన్నారు. భారీ సంఖ్యలో తూటాలు, గ్రనేడ్లు, ఎండు పప్పులు, రొట్టె లు, ఔషధాలు, ఇంజెక్షన్లు, పెయిన్ కిల్లర్లు, రెండు ఏ4 బ్యాటరీలు, ఫోన్లు స్వాధీనం చేసుకొన్నారు. ఈ ఉగ్రవాదులు గ్రామంలో మంచినీరు కోసం ఇంటింటికీ వెళ్లడంతో సమాచారం భద్రతా దళాలకు చేరింది. నిన్న రాత్రి 8 గంటలకు ఎన్‌కౌంటర్ మొదలైంది. దీనిలో కొందరు స్థానికులు కూడా గాయపడ్డారు. ఎన్ కౌంటర్ కారణంగా తొలుత భయపడ్డ స్థానికులు... నేటి ఉదయం నుంచి భయం వీడి ఇళ్ల బయటకు వచ్చి భద్రతా దళాలకు సాయం చేస్తున్నారు. కథువాలో నిన్న రాత్రి ఎన్‌కౌంటర్ మొదలుకాగానే.. అక్కడికి సుదూరంగా ఉన్న దోడా వద్ద పాక్ సైన్యం కాల్పులు ప్రారంభించింది. ఇప్పటివరకు ఓ జవాన్ సహా ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మరణించినట్టైంది.



## మధ్యప్రదేశ్‌లో కలరా కలకలం..

### - ఇద్దరి మృతి

**భోపాల్:** మధ్యప్రదేశ్‌లో కలరా వ్యాప్తి కలకలం రేపుతున్నది. సుమారు 80 మందికిపైగా ఈ వ్యాధి బారినపడ్డారు. కలరా వల్ల ఇద్దరు మరణించారు. భింద్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఫూఫ్ నగరంలోని 5, 6, 7 వార్డుల్లో నీరు కలుషితమైంది. దీంతో స్థానిక ప్రజలకు కలరా సోకింది. ఇప్పటి వరకు సుమారు 84 మంది కలరా బారిన పడినట్లు చీఫ్ మెడికల్, హెల్త్ ఆఫీసర్ డీకే శర్మ తెలిపారు. స్థానిక, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వారిని అడ్మిట్ చేసి చికిత్స అందించినట్లు చెప్పారు. కోలుకున్న రోగులు ఇళ్లకు తిరిగి వెళ్లారని అన్నారు. ప్రస్తుతం ఆరుగురు రోగులు ఆసుపత్రిలో ఉన్నారని తెలిపారు. ఇద్దరు రోగులను గ్వాలియర్ ఆసుపత్రికి రిఫర్ చేయగా వారు కోలుకుని తిరిగి వచ్చారని చెప్పారు. కాగా, కలరా వ్యాపించిన వారిలో ఇప్పటి వరకు ఇద్దరు వృద్ధులు మరణించినట్లు చీఫ్ మెడికల్, హెల్త్ ఆఫీసర్ డీకే శర్మ తెలిపారు. రెండు రోజుల కిందట జ్వరం కారణంగా బాలిక చనిపోయినట్లు చెప్పారు. నగర పాలక సంస్థ కలిషిత నీటిని మూసివేసిందని, ఇతర మార్గాల ద్వారా తాగు నీటిని సరఫరా చేస్తున్నదని తెలిపారు. కలరా సోకిన ప్రాంతంలో సర్వే చేయడంతో శాంపిల్స్ సేకరించినట్లు చెప్పారు. ఆ ప్రాంత ప్రజలకు క్లోరిన్ మాత్రలు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని ప్రజలకు సూచించారు.



## వందే భారత్‌లో భారీ సంఖ్యలో టిక్కెట్ కొనని ప్రయాణీకులు

### – వైరల్‌గా మారిన వీడియో

**లక్నో:** సాధారణ రైళ్లు సామాన్య ప్రయాణీకులతో నిత్యం రద్దీగా ఉంటాయి. కొందరు టికెట్ కొనుగోలు చేయకుండా ప్రయాణిస్తూ టీసీకి దొరికిపోయిన సందర్భాలు చాలానే చూశాం. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన వందేభారత్ రైలులోనూ ఇదే పరిస్థితి నెలకొని ఉన్న వీడియో ఒకటి నెట్టింట వైరల్‌గా మారింది. అత్యాధునిక సౌకర్యాలతో రూపొందించిన ఈ రైలు... టికెట్ కొనుగోలు చేయకుండా ప్రయాణిస్తున్న వారితో కిటకిటలాడింది. లఖ్‌నవూ నుంచి డెహ్రాడూన్ మధ్య ప్రయాణించిన వందే భారత్ రైలులో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన వీడియోను షేర్ చేసిన ఓ వ్యక్తి ప్రీమియం రైలులో ఈ పరిస్థితి తలెత్తడంపై ఆందోళన వ్యక్తంచేశారు. నెటిజన్లు స్పందిస్తూ... దేశంలో మరికొన్ని రైళ్లను ప్రవేశపెట్టడం లేదా బోగీలను పెంచే ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు. వైరల్‌గా మారిన ఈ వీడియోపై ఉత్తర రైల్వేశాఖ స్పందించింది.

ఇది పాత వీడియో అని స్పష్టంచేసింది. "కొందరు రైతులు బలవంతంగా రైలులోకి ఎక్కినప్పుడు జరిగిన సంఘటన ఇది. పాత వీడియోను ప్రస్తుతం షేర్ చేశారు. దయచేసి ఇలాంటివి ప్రచారం చేయకండి. ప్రయాణికులను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోండి" అని 'ఎక్స్' (ట్విటర్) వేదికగా పేర్కొంది.



## ఎర్రకోటపై దాడి కేసు.. ఉగ్రవాది క్షమాభిక్ష పిటిషన్‌ని కొట్టేసిన రాష్ట్రపతి

**ఢిల్లీ:** ఢిల్లీలోని ఎర్రకోటపై 24 ఏళ్ల కిందట ఉగ్రదాడులు జరిగిన విషయం విదితమే. అయితే ఈ కేసులో దోషిగా నిర్ధారణ అయిన పాకిస్థాన్ ఉగ్రవాది మహ్మద్ ఆరిఫ్ అలియాస్ అష్ఫాక్ రాష్ట్రపతి ముందు క్షమాభిక్ష పిటిషన్ దాఖలు చేశాడు. అయితే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము క్షమాభిక్ష పిటిషన్‌ని తిరస్కరించారు. దాఖలు చేసుకున్న క్షమాభిక్ష పిటిషన్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తోసిపుచ్చినట్లు బుధవారం ఓ అధికారి తెలిపారు. రాష్ట్రపతిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ముర్ము తిరస్కరించిన రెండో క్షమాభిక్ష పిటిషన్ ఇదే. ఈ కేసులో మహ్మద్ ఆరిఫ్‌కు న్యాయస్థానం మరణశిక్ష విధించింది.

